www.quicktodaynews.com

RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన వారికి మాత్రమే ప్రాధాన్యం.

తగిన గౌరవ వేతనం ఇవ్వబడును.

వివరాలకు వెంటనే సంప్రదించగలరు 8886460073 8125972476 క్విక్ టుడే

EDITOR : GILLALA BUCHI REDDY | మల్కాజిగిరి | సంపుటి : 1 సంచిక : 152 | గురువారం, ఫిబ్రవరి 22 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8



## ఆరు గ్యారెంటీలపై
# అడుగు వేయండి
### బిజెపి విజయ సంకల్ప యాత్రలో బండి సంజయ్

**నిర్మల్, క్విక్ టుడే :** ఎన్నికల షెడ్యూల్ కు గడువు మరో 30 రోజులే ఉందని, అందుకే 15 రోజుల్లోనే హామీలను అమలు చేసి కాంగ్రెస్ పార్టీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. ఎన్నికల కోడ్ సాకు చూపి హామీలు అమలు చేయకుంటే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని బండి సంజయ్ హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని చూస్తుంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసేలా కనిపిస్తోందన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ.. '6 గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. 70 రోజుల గడువు ముగిసింది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశముంది. ఆలోపే ఇచ్చిన హామీలను అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. జీతాలకే డబ్బుల్లేవు. 2 నెలల్లోనే రూ.10 వేల కోట్ల అప్పు తీసుకొచ్చి జీతభత్యాలు చెల్లిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎట్లా అమలు చేస్తుందో ప్రజలకు చెప్పాలన్నారు. రాష్ట్రంలో 17కు 17 ఎంపీ సీట్లలో బీజేపీని గెలిపిస్తే కేంద్రం వద్దకు వెళ్లి తెలంగాణకు అధిక నిధులు తీసుకొచ్చేందుకు అవకాశం ఉంది. రాముడు, మోదీ బీజేపీ వైపు ఉన్నారు. ప్రజలు ఎటువైపు ఉంటారో తేల్చుకోవాలని' అన్నారు. కొమరం భీం విజయ సంకల్పయాత్రలో భాగంగా బుధవారం మధ్యాహ్నం నిర్మల్ జిల్లాకు వచ్చారు. అనంతరం బండి సంజయ్ కుమార్ స్థానిక ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్ లతో కలిసి నిర్మల్ లోని వెయ్యి ఊడల మర్రిని సందర్శించారు.

## ఆడబిడ్డలను
# కోటీశ్వరులను చేస్తాం

- కోస్గిలో రూ.4,369 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మహిళా సంఘాలతో ముఖాముఖిలో సిఎం రేవంత్



**కొడంగల్, క్విక్ టుడే :** ఆడబిడ్డలను కోటీశ్వరు లను చేయడమే తమ ప్రభుత్వ ఉద్దేశమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. సీఎంగా పదవీ బాధ్యతలు స్వీక రించిన తర్వాత తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో తొలిసారి ఆయన పర్యటించారు. కోస్గిలో రూ.4,369 కోట్ల విలువైన 20 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అందులో ప్రధానమైనది రూ.2,945 కోట్లతో నిర్మించనున్న నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం. అనంతరం మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి.. వారితో ముఖాముఖిలో పాల్గొన్నారు. అభివృద్ధిలో మహిళలను భాగస్వాములను చేస్తామని.. ఐకేపీ, మహిళా సంఘాల ద్వారా పంటల కొనుగోళ్లు చేపడతామని సీఎం తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు పునరుద్దరిస్తామని చెప్పారు. ఐకేపీ, మహిళా సంఘాల ద్వారా పంటల కొనుగోళ్లు చేస్తామని తెలిపారు. అనంతరం మెడికల్, నర్సింగ్, డిగ్రీ, ఇంటర్ కాలేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

## గృహిణిని తక్కువగా
# చేయరాదు
### ఆమె ఇంటిపనులను లెక్కగట్టలేం
### సుప్రీం కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, క్విక్ టుడే :** ఇంటిపని, వంటపని చేస్తూ సమయానికి కుటుంబానికి ఏం కావాలో అది అందిస్తూ చక్కగా ఇంటిని నిర్వహించే భార్య సేవలు వెలకట్టలేనివని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆమె సేవలను డబ్బు కోణంలో చూడడం తగదని పేర్కొంది. ఓ యాక్సిడెంట్ కేసు విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. 2006లో ఓ మహిళ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. ఆమె ప్రయాణిస్తున్న వాహనానికి బీమా సౌకర్యం లేకపోవడంతో వాహన యజమాని ఆమెకు పరిహారం చెల్లించాల్సి వచ్చింది. కేసును విచారించిన మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ మృతురాలి కుటుంబానికి రెండున్నర లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. అయితే, ఆ మొత్తాన్ని పెంచాలని కోరుతూ బాధిత కుటుంబం ఉత్తరాఖండ్ హైకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్‌ను హైకోర్టు 2017లో కొట్టివేసింది. మహిళ గృహిణి కాబట్టి ఆమె ఆదాయం పరిమితమని, కాబట్టి ఆమెకు ఇవ్వాల్సిన పరిహారం ఫిక్స్‌డ్‌గా ఉంటుందని, కనీస ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని పరిహారం చెల్లించడం సబబేనని తేల్చి చెప్పింది.

## వందేండ్ల భవిష్యత్ కు
# ప్రణాళికలు

- పెట్టుబడులకు సర్కారు నుంచి రక్షణ
- అభివృద్ధి మీదే ఫోకస్ పెట్టాం
- జహీరాబాద్ లో నిమ్స్ కు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- ఫార్మా విలేజ్ లు డెవలప్ చేసి సౌకర్యాలు కల్పిస్తం
- సీఐఐ విద్య, నైపుణ్యాభివృద్ధి సమావేశంలో సీఎం రేవంత్



**హైదరాబాద్, క్విక్ టుడే :** తెలంగాణ రాష్ట్ర వందేండ్ల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణను ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దుతామని అన్నారు. తమ ఫోకస్ అంతా అభివృద్ధిపైనే పెట్టామని అన్నారు. ఇందుకోసమే కేంద్ర మంత్రులతో భేటీ అయినట్టు చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో రక్షణ కల్పిస్తుందని, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమయ్యే సౌకర్యాలను కూడా కల్పిస్తుందని అన్నారు. కొత్త ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. అలాగే ఏ స్థాయిలో ఉన్నవారైనా తమ ఆలోచనలను ప్రభుత్వంతో పంచుకోవచ్చని అన్నారు. వారి ఆలోచనలను కూడా అభివృద్ధికి ఉపయోగిస్తామని అన్నారు. బుధవారం హైదరాబాద్ లో నిర్వహించిన సీఐఐ విద్య, నైపుణ్యాభివృద్ధి సమావేశానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. అపారమైన అనుభవం ఉన్న పారిశ్రామిక వేత్తలు తమ అనుభవాన్ని రంగరించి తెలంగాణ అభివృద్ధికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 2050 నాటికి మాస్టర్ ప్లాన్ ఫర్ తెలంగాణ తయారు చేస్తున్నామని, రాష్ట్రం మొత్తం సింగిల్ యూనిట్ గా ప్రపంచంతో పోటీ పడాలన్నదే తమ ఆలోచన అని చెప్పారు. ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్ మధ్య డ్రైపోర్టులను ఏర్పాటు చేస్తామని, ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేయడంతో పాటు అక్కడ అన్ని వసతులు కల్పిస్తామని చెప్పారు. విద్య, వైద్యం, రోడ్లు, తాగునీరు ఇలా మౌలిక వసతులన్నీ కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. డిఫరెంట్ ఇన్వెస్టర్లను క్లస్టర్లుగా విడగొట్టనున్నామని సీఎం చెప్పారు. జహీరాబాద్‌లో నిమ్స్ ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిదని, త్వరలో ఏర్పాటు చేయబోతున్నమని సీఎం చెప్పారు. ఇంజినీరింగ్ చదివిన వాళ్లు కూడా 15 వేలకు పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని, స్కిల్ విషయంలో ఎక్కడో గ్యాప్ ఉందని తాను భావిస్తున్నానని, దానిని పూర్తి చేయడానికి ప్రయత్నించాలని కోరారు. తాము ప్రారంభించబోయే స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లు ఇందుకు ఉపయోగపడతాయని భావిస్తున్నట్టు సీఎం చెప్పారు.

# యధాతథంగా బస్ ఛార్జీలు
### ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు లేవు: ఎండి

**హైదరాబాద్, క్విక్ టుడే :** తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమక్క - సారక్క జాతర బుధవారం నుంచి ప్రారంభమైంది. మేడారం జాతరకు టీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఈనెల 18 నుంచి 25 వరకు ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించామని... ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయట్లేదని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ విషయంపై టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ.. మేడారం జాతరకు ఆర్టీసీ 6000 ప్రత్యేక బస్సులు నడుపుతోందన్నారు. మేడారం జాతరలో 51 బేస్ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చేటువంటి అవకాశం ఉందన్నారు.

## రక్తమోడిన రైతుల
# చలో ఢిల్లీ యాత్ర
### పోలీస్ కాల్పుల్లో యువరైతు మృతి



**న్యూఢిల్లీ, క్విక్ టుడే :** ఛలో ఢిల్లీ మార్చ్‌లో భాగంగా పంజాబ్-హర్యానా సరిహద్దు శంభు వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. హర్యానా పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్‌ను విడవగా ఒక రైతు తలకు గాయాలై మరణించాడు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఘర్షణకు సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. రైతులు చేపట్టిన చలో ఢిల్లీ మార్చ్‌లో భాగంగా బుధవారం పంజాబ్- హర్యానా సరిహద్దు శంభు వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఖానౌరీ సరిహద్దులో నిరసనకారులను అడ్డుకునే క్రమంలో హర్యానా పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించారు. దీంతో ఒక రైతు తలకు గాయాలై మరణించాడు. పలువురు రైతులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఒకవైపు ఘర్షణ వాతావరణం కొనసాగుతుంటే.. మరోవైపు కేంద్రం వారిని చర్చలకు ఆహ్వానించింది. 'రైతుల డిమాండ్లపై మరోసారి చర్చించేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. చర్చలకు రైతు సంఘం నాయకులను ఆహ్వానిస్తున్నాం. శాంతియుత వాతావరణాన్ని కొనసాగించడం చాలా ముఖ్యం' అంటూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా ఎక్స్(ట్విటర్)లో పోస్టు పెట్టారు. ఇప్పటికే రెండు వర్గాల మధ్య నాలుగు దఫాలుగా చర్చలు జరిగినప్పటికీ ఫలితం లేకుండాపోయింది.

## ప్రభుత్వాన్ని
# పడగొడుతారా?

- టచ్ చేసి చూడండి తెలుస్తుంది
- గడ్కరీని కలిసి ఆర్ఆర్ఆర్‌కు నిధులు అడిగాం
- రాష్ట్రం కోసం ప్రధాని మోడీని కూడా కలుస్తాం
- కిషన్‌రెడ్డికి కోమటిరెడ్డి సవాల్



**హైదరాబాద్, క్విక్ టుడే :** ప్రభుత్వాన్ని పడగొడ్తమన్నట్టుగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతున్నారని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్ అయ్యారు. టచ్ చేసి చూడు.. నామరూపాల్లేకుండా చేస్తామన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భువనగిరి ఖిల్లా మీద రోప్ వేసుకుందామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని రూ. 200 కోట్లు అడిగితే కనీసం స్పందించలేదన్నారు. నాలుగేండ్ల నుంచి ఫైల్ దగ్గర పెట్టుకొని సొంత రాష్ట్రానికి కనీసం రూ. 200 కోట్లు తేలేని మంత్రి కిషన్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. కేబినెట్ లో ఉంటూ కనీసం రూ. 200 కోట్ల నిధులు ఇవ్వలేక పోయారని, తాము వెళ్లి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి రూ. 3 వేల కోట్ల పనులు తెచ్చుకున్నామన్నారు. అభివృద్ధి పనుల కోసం అవసరమైతే ప్రధాన మంత్రిని కూడా కలుస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అబద్దాలు చెప్పి అధికారంలోకి రాలేదని అన్నారు. రెండు మూడు రోజుల్లో మరో రెండు హామీలను అమలు చేయబోతున్నామని చెప్పారు. ఎన్నికలకు ముందు మోదీ మాట్లాడిన స్పీచ్ ఆడియోలు తన వద్ద ఉన్నాయని, 20 కోట్ల ఉద్యోగాలిస్తానన్న ప్రధాని ఇచ్చారా.. అని ప్రశ్నించారు. బ్లాక్ మనీ తెస్తానన్నప్రధాని తెచ్చారా..ఓ వైపు ఢిల్లీలో రైతులు ధర్నా చేస్తుంటే పట్టించుకోవడం లేదన్నారు. రూ. 500 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర రూ. 1200 చేరిందని అన్నారు. నమామి గంగాకు కేంద్రం రూ. 4 వేల కోట్లు ఖర్చు చేసిందని, హైదరాబాద్ లోని మూసీకి నిధులెందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కేసుల నుంచి తప్పించుకునేందుకే బీఆర్ఎస్, బీజేపీతో లోపాయికారి ఒప్పందం చేసుకుందని విమర్శించారు. అందులో భాగంగానే కేసీఆర్ ఢిల్లీ వెళుతున్నారని అన్నారు. శత్రువైన మోదీ దగ్గరికి కేసీఆర్ వెళ్లిన కేటీఆర్ ను ఆశీర్వదించండి అని అడిగారంటే ఇద్దరి మధ్య దోస్తానా కుదిరినట్టేనన్నారు. తమ ఢిల్లీ పర్యటన విజయవంతం అయిందని... తెలంగాణ రాష్ట్రంలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు నిధులు కేటాయిస్తానని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చినట్లు రోడ్ల భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఆర్ఆర్ఆర్ పూర్తి అయితే హైదరాబాద్‌తో పాటు తెలంగాణ 50 శాతం కవర్ అవుతుందని.. హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయిని అన్నారు. రైల్వే ప్రాజెక్టుకు కూడా హామీ ఇచ్చారని.. ఇక పనులు మొదలవుతాయని తెలిపారు. నల్గొండ రింగ్ రోడ్డుకు రూ.700కోట్లు ఇస్తామని అన్నారని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు మోడీని ఇక్కడ తిడతారు అక్కడ కాళ్లు పట్టుకుంటారని ఎద్దేవా చేశారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ నిర్మాణం కోసం

# బొడిగె దంపతుల విరాళం

### - సాయి ప్రియ నగర్ రేణుక ఎల్లమ్మ తల్లి కోసం రూ.1,11,111 విరాళం



**మేడిపల్లి - క్విక్ టుడే :**
పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ సాయి ప్రియ నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ సాయి ప్రియ నగర్ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ నిర్మాణ నిధి సేకరణ కోసం విరాళాలు అడగగా ,వెంటనే స్పందించిన కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రధాన కార్యదర్శి, యువ నాయకులు బొడిగె ప్రవళిక ఉదయ్ రాజ్ గౌడ్ లు ఒక లక్ష నూట పదకొండు రూపాయల విరాళాల చెక్కును అందజేశారు. ఈ మేరకు మాజీ సీనియర్ పొలిటిషన్,మాజీ సర్పంచ్, కో ఆప్షన్ సభ్యులు తన తాత బొడిగే రాందాస్ గౌడ్ చేతుల మీదుగా ఈ చెక్కును వారికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకప్పుడు మా తాత, మా తండ్రి, మా కాందన్ మొత్తం పర్వతాపూర్, మేడిపల్లి, పీర్జాదిగూడ గ్రామ పంచాయతీల కాలంలో ఎంతోమంది నిరుపేదలకు గుడులు, బడులకు ఆదుకున్న చరిత్ర మాకు ఉందని, ఇప్పుడు మూడవ డివిజన్, ఐదో డివిజన్లలో మేము కొన్ని సామాజిక కార్యకలాపాలు కొనసాగిస్తున్నామని, అందులో భాగంగా బుదవారం అమ్మవారి దేవాలయం నిర్మాణం కోసం రూ.1 ,11,111 రూపాయలను మా తాత బొడిగే రాందాస్ గౌడ్ చేతుల మీదుగా విరాళాలు ఇవ్వడం జరిగిందని,ఆ అమ్మవారి కటాక్షం మా కుటుంబ సభ్యుల మీద అదేవిధంగా ఈ నిరుపేద ప్రజల మీద ఉండాలని, ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలిగి విరజిల్లాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొడిగ కుటుంబ సభ్యులు, సాయి ప్రియ నగర్ యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

## నూతన డీఎస్పీ శివరాం రెడ్డికి మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘన సన్మానం



**నల్లగొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21 ( క్విక్ టుడే)** : మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా డీఎస్పీ గా బాధ్యతలు చేపట్టిన శివరాం రెడ్డి కి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.మహిళలకు రక్షణ కల్పించే విధంగా మహిళల సమస్యలు పరిష్కరించాలని డిఎస్పి కి వివరిస్తూ మర్యాదపూర్వకంగా కలిసిన నాయకురాలు ఉపాధ్యక్షురాలు ఎగడి సుజాత,ప్రధాన కార్యదర్శి ఎక్స్ కౌన్సిలర్ దుబ్బారూప, కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు నాగరాణి టౌన్ సెక్రటరీ లలిత మల్లిక మండల అధ్యక్షురాలు స్వరూపారెడ్డి ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల శివకుమార్,లాలూ నాయక్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ, సీలింగ్ భూములను గుర్తించి గూగుల్ మ్యాప్ రూపొందించాలి

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



**మేడ్చల్ కలెక్టరేట్, క్విక్ టుడే :**
జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ , సీలింగ్ భూములు అన్నిటిని గుర్తించి గూగుల్ మ్యాప్ తయారు చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం విసి మీటింగ్ హాల్లో ఆర్డీవోలు, ఎమ్మార్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లో ఉన్న సీలింగ్ భూములు అన్నింటిని ధరణిలో క్రయవిక్రయాలు జరగకుండా చూడాలన్నారు. కోర్టుకేసులు పెండింగ్ లో ఉన్నా వాటిని కౌంటర్ ఫైల్ చేయమని తహశీల్దార్లకు ఆదేశించారు. హౌసింగ్ బోర్డ్ ల్యాండ్ లను కాపాడవలసిందిగా కలెక్టర్ కోరారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల యొక్క గూగుల్ మ్యాప్ ను తయారు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఓ ఆర్ ఆర్ చుట్టూ ఇండస్ట్రియల్ పార్కు స్థాపించడానికి గవర్నమెంట్ పార్సిల్ గుర్తించమన్నారు. మండల పరిధిలోని పెండింగ్ లో ఉన్న టీఎస్ బి పాస్ దరఖాస్తులను పరిశీలించి పంపవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఆర్డీవో శ్యాంప్రకాష్, మండల తహశీల్దార్ లు పాల్గొన్నారు.

# జర్నలిజం అంటే సత్యం కోసం అన్వేషణ

## - పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి





**పీర్జాదిగూడ :** జర్నలిజం అంటే సత్యం కోసం అన్వేషణ, విచారణ, నైతిక ప్రమాణాల పట్ల అచంచలమైన నిబద్ధత మరియు అన్నింటికంటే ముఖ్యంగా సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండటం అని మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ 2024 డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మేయర్ జక్క వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ....జర్నలిజం సమాజం యొక్క ఆధునికీకరణ మరియు అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని అన్నారు. నేడు జర్నలిజం అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నదని అన్నారు. నైతిక ప్రమాణాలు మరియు వృత్తి నైపుణ్యం యొక్క క్షీణత వల్ల కొంతమంది జర్నలిస్టులు అనుసరించే పని శైలి మరియు సంస్కృతి దీనికి పూర్తిగా విరుద్ధంగా ఉండటంతో విశ్వసనీయతకు ముప్పుగా మారిందన్నారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి మరియు ప్రజలకు మధ్య అంతరాన్ని తగ్గించే వారధి అయితే ప్రధాన సమస్యలను హైలైట్ చేయడానికి బదులుగా పనికిరాని అంశాలను ప్రజలపై బలవంతంగా రుద్దుతన్నారని పేర్కొన్నారు. జర్నలిస్టులు నిష్పక్షపాతంగా మరియు నిష్పాక్షికంగా పని చేయాలని అయితే వారిలో కొందరు స్పష్టంగా రాజకీయ పార్టీలు లేదా వ్యక్తుల ప్రతినిధులు మరియు వారి ఎజెండాను ప్రచారం చేయడం సరికాదని తెలిపారు.ప్రెస్ క్లబ్‌లు మరియు సీనియర్ జర్నలిస్టుల నిశ్శబ్దం కూడా పరిస్థితిని మరింత దిగజార్చుతోందన్నారు. మంచి, గుణాత్మకమైన మరియు నైతికతతో కూడిన జర్నలిజం యొక్క ఎజెండాను తిరిగి శక్తివంతం చేయవచ్చని అన్నారు. ద్వేషపూరిత ప్రసంగాలు మరియు ధృవీకరించని కంటెంట్‌ను వ్యాప్తి చేయడానికి అవకాశం ఇవ్వకుండా చూసుకోవాలన్నారు. తప్పుడు కథనాలను ప్రదర్శించే వారిని ఆమోదించకుండా ఉండటానికి సాధారణ ప్రజలలు అలాంటి వ్యక్తులకు అనవసరమైన ప్రాధాన్యత ఇవ్వకుండా ఉండాలి. జర్నలిజం నిస్సందేహంగా చాలా గొప్పది మెరుగైన, నైతిక విలువలతో కూడిన జర్నలిజం కోసం ఈ రంగంలోని సమస్యలను తొలగించడం ఈ సమయంలో ఎంతైనా అవసరముందని పేర్కొన్నారు.

## నల్లగొండ జిల్లాలో పార్లమెంట్ పరిధిలో

# హట్టహాసంగా ప్రారంభమైన క్రికెట్ పోటీలు

**- వరల్డ్ హిందూ లైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు**
**-ఖేలో ఇండియా, ఖేలో తెలంగాణ జీతో నల్లగొండ నినాదంతో ఉత్సవాలు**
**-క్రీడాకారులకు బహుమతులు అందజేసిన వర్షిత్ రెడ్డి**
**-క్రికెట్ పోటీలను ప్రారంభించిన వరల్డ్ హిందూ లైన్స్ ఫౌండర్, బిజెపి జాతీయ ఓబిసి సోషల్ మీడియా మెంబర్ పెరిక సురేష్**





**నల్లగొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21 (క్విక్ టుడే) :**
నల్లగొండ పట్టణంలో హాట్టాహసంగా క్రికెట్ పోటీలో ప్రారంభమయ్యాయి. మేకల అభినవ స్టేడియంలో కేలో తెలంగాణ వరల్డ్ హిందూ లైన్స్ ఆధ్వర్యంలో నల్లగొండ పార్లమెంటు స్థాయి క్రీడా పోటీలు క్రికెట్ మరియు సపక్ తక్రా బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి హాజరై క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ క్రీడోత్సవాలను వరల్డ్ హిందూ లైన్స్ వ్యవస్థాపకులు, బిజెపి జాతీయ ఓబిసి సోషల్ మీడియా నెంబర్ పెరిక సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పెరిక సురేష్ మీడియాతో మాట్లాడుతూ కెలో ఇండియా, కెల్లో తెలంగాణ జితో నల్గొండ నల్గొండ అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. నల్గొండ పార్లమెంట్ యువత కోసం 38 మండలాలు నుంచి 16 క్రికెట్ టీం లో ఈ పోటీల్లో పాల్గొన్నాయి అని అన్నారు. దీని యొక్క ముఖ్య ఉద్దేశం యువతకి చదువుతోపాటు క్రీడల్లో కూడా పోటీ తత్వం పెంచాలని లక్ష్యంతోని మా రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు, వారి సూచనలపై బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాం. క్రికెట్ తో పాటు ఇతర ఆటలు ప్రోత్సాహానికి ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. ఓబీసీ మోర్చా నేషనల్ ప్రెసిడెంట్ ఎంపీ రాజ్యసభ మెంబర్ పార్లమెంటరీ బోర్డు మెంబర్ డాక్టర్ కి లక్ష్మణ్ కూడా ప్రోత్సహికరం ఇచ్చారని అన్నారు. ఇన్ని టీములు పాల్గొనడం నాకు చాలా ఆనందంగా ఉంది అని, క్రీడలతో పాటు మేము హెల్త్ క్యాంపులు మరియు అన్నదాన కార్యక్రమాలు ఇంకా సేవా కార్యక్రమాలు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో చేస్తున్నామని తెలిపారు. ధన మంత్రి నరేంద్ర మోడీ చెప్పిన విధంగా 370 ఎంపీ సీట్లు దేశవ్యాప్తంగా సాధిస్తాం. 400 సీట్లు కూడా ఎన్ డి ఏ భాగస్వామ్యంతోని గెలవబోతున్నామని తెలియజేశారు. మోడీ ఆధ్వర్యంలో దేశం చాలా అభివృద్ధి చెందిందని ఆయన కొనియాడారు. రాబోయే ఐదేళ్లలో ఆర్థికంగా దేశము మూడో స్థానంలో ఉంటుంది అని తెలిపారు. అర్హులైన వారికి భారతరత్న అవార్డులు ఉన్నారని ఇస్తున్నారు అని, అదేవిధంగా వచ్చే ఒలంపిక్ గేమ్స్ కూడా భారత దేశంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. క్రికెట్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా 50వేల రూపాయలు, రెండవ బహుమతి 30వేలు, మూడవ బహుమతి 10వేల రూపాయల నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందని పెరిక సురేష్ తెలియజేశారు.

# దేశంలో పెట్టుబడిదారీ దోపిడి వర్గం శాశ్వతం కాదు

**-సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున**

**నల్లగొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21 (క్విక్ టుడే)** : దేశంలో పెట్టుబడిదారీ దోపిడి వర్గం శాశ్వతం కాదని, కమ్యూనిజమే అజేయమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున బండా శ్రీశైలం అన్నారు. బుధవారం కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక 176వ వార్షికోత్సవం - రెడ్ బుక్ డే సందర్భంగా నల్లగొండ దొడ్డి కొమరయ్య భవన్ లో సోషలిజం విజయాలు- -విచ్చిన్నాలు అనే పుస్తకాన్ని పఠనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోపిడీదారులకు పెట్టుబడుదారులకు సింహ స్వప్నంగా కమ్యూనిజం నిలుస్తుందని అన్నారు. దేశంలో మతోన్మాదులు మతాల మధ్య జాతుల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నరని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న మితవాద శక్తులను నిరోధించడానికి లెఫ్ట్ భావజాలం వృద్ధి చెందడానికి దేశంలో కమ్యూనిస్టు వామపక్ష అభ్యుదయవాద శక్తుల మధ్య సంఘీభావం సహకారం పెరగడం ఎంతో అవసరమని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చినపాక లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దండెంపల్లి సత్తయ్య గంజి మురళీధర్, మల్లం మహేష్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.



జన్మదిన, వివాహ
పదవీ విరమణ
శుభాకాంక్షలు

ఉద్యోగం, వ్యాపారం
రియల్ ఎస్టేట్
బహిరంగ ప్రకటనలు

జయంతి, వర్ధంతి
శ్రద్ధాంజలి, నిర్యాణము

అన్ని రకాల ప్రకటనల కోసం సంప్రదించండి
88864 60073
81259 72476

# పోలీస్ శాఖకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలి

-నూతన ట్రైనీ కానిస్టేబుల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ చందన దీప్తి





**నల్లగొండ జిల్లా ప్రతినిధి. ఫిబ్రవరి 21 (క్విక్ టుడే ) :**
జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో నూతనంగా ఎంపికైన ట్రైనీ కానిస్టేబుల్స్ కు 9 నెలల శిక్షణ నిమిత్తం సంగారెడ్డి, కామారెడ్డి, వికారాబాద్ జిల్లాల నుండి వచ్చిన ఏఆర్ విభాగానికి చెందిన 203 మంది పురుష అభ్యర్థుల శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ చందనా దీప్తి ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వల చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన ట్రైనీ కానిస్టేబుళ్ళకు ముందుగా అభినందనలు తెలిపి మాట్లాడుతూ వేలాది మంది అభ్యర్థులతో పోటీపడి తుది పరీక్షలో అర్హత సాధించి ఎంపికై శిక్షణ కోసం పోలీస్ శిక్షణా కేంద్రానికి వచ్చి తొమ్మిది నెలలు పాటు క్రమశిక్షణతో వ్యహరిస్తూ శిక్షణ సమయంలో ఇండోర్, ఔట్ డోర్ లలో శిక్షకుడు తెలిపే ప్రతి అంశాలపై పట్టు సాధిస్తూ తొమ్మిది నెలలు పూర్తి చేసుకొని ముందుకు సాగాలని అన్నారు.పోలీస్ శాఖలో సమాజంలో ప్రజా సేవ చేయుటకు మంచి అవకాశం ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రజా సేవ చేస్తూ సమాజంలో మంచి గుర్తింపు పొందాలని అన్నారు. ఈ తోమ్మిది నెలల పాటు కోనసాగే ఈ శిక్షణ విజయవంతంగా పూర్తికొని అప్పగించిన విధుల్లో రాణిస్తూ ముందు ముందు ఉన్నత స్థాయిలకు వెళ్తూ పోలీస్ శాఖకు మీ కుటుంబ సభ్యులకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమములో డిటిసి ప్రిన్సిపాల్ అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డిఎస్పీ విఠల్ రెడ్డి, యస్.బి డీఎస్పీ రమేష్, సైబర్ క్రైమ్ డిఎస్పీ లక్ష్మి నారాయణ, సిఐలు గోపి,సత్యనారాయణ, కొండల్ రెడ్డి,కరుణాకర్, ఆర్ఐలు హరిబాబు,సూరప్ప నాయుడు, యస్.ఐలు మరియు ఆవుట్ డోర్, ఇన్‌డోర్ సిబ్బంది పాల్గోన్నారు.

## తొలిమెట్టు ఉన్నతి కార్యక్రమాలను
# రద్దు చేయాలి



**- 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు సూపర్ న్యూమరీ పోస్టులను క్రియేట్ చేసి వారి స్వంత జిల్లాలలో పోస్టింగ్ లు ఇవ్వాలి**
**- మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ డిమాండ్**

**నల్లగొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21(క్విక్ టుడే ):**

విద్యార్థులను, ఉపాధ్యాయులకు అయోమయానికి గురిచేస్తున్న అశాస్త్రీయమైన తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను రద్దు చేయాలని, 317 జీవో ద్వారా స్వంత జిల్లాలకు, కుటుంబాలకు దూరమై నష్టపోయిన బాధిత ఉపాధ్యాయులను సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి వారిని స్వంత జిల్లాలకు పంపి న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు . బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ టీఎస్ జిల్లా సంఘ భవనంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు, నకిరేకల్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు, కోదాటి రాములు పి ఆర్ టీ యు టీఎస్ సంఘంలో చేరిన సందర్భంగా సంఘ సభ్యత్వాన్ని అందించే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 53 సంవత్సరాలకు పైగా సుదీర్ఘ చరిత్ర కలిగివుండి, ఉపాధ్యాయుల అనేక సమస్యలను సాధించిన ఏకైక పెద్ద సంఘం పీఆర్టీయూ టీఎస్ అని, పెండింగులో ఉన్న ఇతర సమస్యలను కూడా సాధించడానికి తమ సంఘం కట్టుబడి ఉన్నదని అన్నారు. ఆగిపోయిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు వేసవిసెలవుల్లో నిర్వహించడానికి, పెండింగులో ఉన్న బిల్లులను క్లియర్ చేయడానికి కూడా సంఘపక్షాన ప్రాతినిధ్యం చేసినట్లు తెలిపారు. వివిధ క్యాడర్ల లోని ఉపాధ్యాయుల వేతనాలలో వ్యత్యాసాన్ని తొలగించాలని, మెరుగైన ఫిట్ మెంట్ ను ప్రకటించాలని ఇప్పటికే పీఆర్సీ కమిటీకి సంఘ పక్షాన ప్రాతినిధ్యం చేయడం జరిగిందనీ, ముఖ్యమంత్రి కి, ఆర్థిక మంత్రి కి కూడా త్వరలోనే విన్నవిస్తామని అన్నారు. గురుకులాల, కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల మరియు సమగ్రశిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూడా సంఘం ఎల్లవేళలా కృషి చేస్తున్నదని అన్నారు. క్రమశిక్షణ, వృత్తిపట్ల అంకితభావం కలిగిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కోదాటి రాములు సంఘంలో చేరడం వలన సంఘం మరింత బలోపేతమవుతుందని అన్నారు. కోదాటి రాములుని సంఘంలోకి చేర్పించిన నకిరేకల్, గుర్రంపోడు మండల శాఖలకు అభినందనలు తెలిపారు.
సుదీర్ఘమైన చరిత్ర కలిగి అతిపెద్ద ఉపాధ్యాయ సంఘంగా పేరొంది సమస్యల సాధనకు కట్టుబడి ఉన్న నాయకత్వం కలిగిన, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలను కలిగిన పి ఆర్ టి యు టీఎస్ లో చేరేందుకు ఇంకా చాలామంది ఉపాధ్యాయులు ఆసక్తి చూపుతున్నారని, సంఘ బలోపేతానికి ప్రతిఒక్క పీఆర్టీయూ టీఎస్ కార్యకర్త కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా పి ఆర్ టి యు టి ఎస్ లో చేరిన కోదాటి రాములు కి సభ్యత్వాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కోదాటి రాములు మాట్లాడుతూ పీఆర్టీయూ టీఎస్ వంటి పెద్ద సంఘంలో చేరడం తనకు ఎంతో సంతోషం కలిగించిందని, సంఘ బలోపేతానికి తనవంతు కృషి తప్పక చేస్తానని అన్నారు.
పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు డివిఎస్ ఫణికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాళం నారాయణరెడ్డి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు చామల చంద్రశేఖర్, అంబటి అంజయ్య, బండ రమేష్ రెడ్డి, యుగంధరాచారి, ఎడ్ల భిక్షం, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి, రాష్ట్ర బాధ్యులు సిలిగిరెడ్డి రామకృష్ణారెడ్డి, లగిశెట్టి సత్యనారాయణ, బోయినపల్లి రమేష్ బాబు, సోమారపు రాములు, అయిటిపాముల యాదగిరి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు తరాల పరమేశ్ యాదవ్, గుర్రంపోడు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేకల అన్నెపురెడ్డి, నాంపల్లి శ్రవణ్ కుమార్, నకిరేకల్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కడారు అనిత, కందాల చంద్రారెడ్డి, మురళీమోహన్ రెడ్డి, కసిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మారపాక నర్సయ్య, వంటల ఆనంద్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

## కెటిఆర్ చొరవతో జైలునుంచి విముక్తి - హత్య కేసులో విడుదలయిన ఐదుగురు

**హైదరాబాద్:**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవతో ఓ హత్య కేసులో దుబాయ్‌లో జైలుశిక్ష అనుభవిస్తున్న ఐదుగురు తెలంగాణ వాసులకు విముక్తి లభించింది. నేపాల్‌కు చెందిన వాచ్‌మెన్ బహదూర్‌సింగ్ హత్య కేసులో ఐదుగురు సిరిసిల్ల వాసులకు జైలుశిక్ష పడింది. ముందుగా పదేళ్ల జైలుశిక్ష వేసిన దుబాయ్ కోర్టు ఆ తర్వాత 25 ఏళ్లకు వారి జైలుశిక్షను పొడిగించింది. ఇప్పటికే 18 ఏళ్ల జైలుశిక్ష అనుభవించారు. మరో ఏడేళ్లు శిక్ష అనుభవించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవ తీసుకున్నారు. నేపాల్‌కు వెళ్లి హత్యకు గురైన బహదూర్‌సింగ్ కుటుంబసభ్యులకు రూ.15 లక్షల పరిహారం అందజేశారు. అనంతరం వారితో క్షమాభిక్ష పత్రం రాయించారు. అయితే మారిన నిబంధనల మేరకు హతుని కుటుంబం క్షమాభిక్ష పెట్టినా.. వారిని విడుదల చేసేందుకు దుబాయ్ కోర్టు అంగీకరించలేదు.దాంతో తెలంగాణవాసుల తరఫు న్యాయవాదులు అనారోగ్య కారణాలు చూపుతూ మరోసారి వారి విడుదలకు ప్రయత్నించారు. దాంతో అనారోగ్య కారణాల రీత్యా వారిని ఏడేళ్లు ముందుగానే కోర్టు విడుదల చేసింది. దాంతో వారు దుబాయ్ నుంచి సిరిసిల్లకు చేరుకున్నారు. 18 ఏళ్ల తర్వాత కుటుంబసభ్యులను కలుసుకుని భావోద్వేగానికి లోనయ్యారు.

## రామకృష్ణ నగర్ కాలనీలో
# రసవత్తర రాజకీయం

- కాలనీ అధ్యక్ష పదవి ఎన్నిక కోసం పోటా పోటీ
- కార్పొరేటర్ భర్తతో నవబోలు రాజశేఖర్ రెడ్డి ఢీ
- నువ్వా.. నేనా? అన్నట్లు ఇద్దరి మధ్య టఫ్ ఫైట్
- 19వ డివిజన్ కాలనీలో ఈ నెల 25న పోలింగ్



**పీర్జాదిగూడ, క్విక్ టుడే :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్‌లోని రామకృష్ణ నగర్ కాలనీ అధ్యక్షపదవి ఎన్నిక రసవత్తరంగా మారింది. రామకృష్ణ నగర్ కాలనీలో గత సెప్టెంబర్ లో అధ్యక్ష పదవి గడువు ముగియగా గత కమిటీ వారు ఆలస్యం చేశారు. మళ్లీ ఎన్నికలు నిర్వహించాలనే ఉద్దేశంతో పోటీ తప్పలేదు. కాగా ఈ కాలనీ ఎన్నికల్లో ఇద్దరు నామినేషన్లు వేయడంతో ఎన్నికలు నిర్వహించాల్సి వస్తోంది. ఈ ఇద్దరిలో ఒకరు ఒకరు స్థానిక 19వ డివిజన్ కార్పొరేటర్ అలవాల సరిత భర్త అలవాల దేవేందర్ గౌడ్ పోటీ చేస్తుండగా మరొకరు కామన్ మ్యాన్ కాలనీకి చెందిన ననబోలు రాజశేఖర్ రెడ్డి అధ్యక్ష పదవికి నామినేషన్ వేశారు. అయితే ఈ నెల 25వ తేదీన ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ భర్తతో కామన్ మ్యాన్ పోటీకి దిగడం కాలనీలోనే కాకుండా కార్పొరేషన్ పరిధిలో చర్చనీయాంశంగా మారింది. రామకృష్ణ నగర్ కాలనీ ఏర్పాటు నుంచి నేను భాగస్వామ్యంగా ఉన్నానని, మా తండ్రి ననబోలు తిరుపతిర్డె కాలనీ అధ్యక్షుడిగా పనిచేశారని ననబోలు రాజశేఖర్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. 20 ఏళ్లుగా కాలనీ అభివృద్ధి కోసం ఎన్నో పనులు చేశామని తెలిపారు. 2005లో కేవలం 16 కుటుంబాలు ఉండగా అప్పుడు మట్టి రోడ్లు, డ్రైనేజీ, తాగు నీటి సమస్యలు తీవ్రంగా ఉండేవి. ప్రస్తుతం బరిలో ఉన్న అలవాల దేవేందర్ గౌడ్ గత నాలుగున్నరేండ్లుగా అధ్యక్ష పదవిలో కొనసాగారు, ఆయన కాలనీ అభివృద్ధి కోసం ఏమాత్రం పట్టించుకోలేదు. ఆయన భార్య కార్పొరేటర్‌గా అయినప్పటికీ కాలనీలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. కాలనీలోని సమస్యలను వారికి చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయింది, వారి వైఫల్యాలను ఎంత చెప్పినా తక్కువే. కాలనీ ప్రధాన రహదారి బతుకమ్మ సెంటర్ నుంచి కమాన్ మార్గంలో మూడు చోట్ల సిమెంట్ రోడ్డు తవ్వి పైపులు వేసి మళ్లీ పూడ్చకుండా వదిలేశారు. హరిత హారంలో నాటిన కొనోకార్పస్ అనే విషపూరిత చెట్లను తొలగించాలని వేడుకున్నా కార్పొరేటర్ పట్టించుకున్న పాపాన పోలేదు. కాలనీలో పోకిరీల చేష్టలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు, కాలనీలో వరదనీటి, మురుగునీటి సమస్యలను పెడచెవిన పెట్టారు. నాలుగున్నరేళ్లుగా చెరువుల్లో కనీసం గుర్రపు డెక్క అకును సైతం తొలగించక పోవడంతో దోమల బాధ పెరిగింది. దోమల నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో సాయంత్రం అయితే చాలు జనం ఇండ్ల నుంచి బయటకి రాలేని పరిస్థితి నెలకొంది. ఇన్నాళ్ల నుంచి అధికారంలో ఉండి కూడా ఎలాంటి పనులు చేయనందున ఈ నెల 25న జరిగే కాలనీ అధ్యక్ష ఎన్నికల్లో అలవాల దేవేందర్ గౌడ్ కు కాలనీవాసులు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉంది. ఆయనపై ఉన్న వ్యతిరేకతను ఓట్ల రూపంలో చూపించాలి. ఎన్నికల్లో మర్రి చెట్టు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలి అని కాలనీ వాసులను రాజశేఖర్ రెడ్డి వేడుకుంటున్నారు. కాలనీ పెద్దలు, మేధావులు, యువతీ యువకులు అంతా ఆలోచించి ఓటు వేసి మార్పును తీసుకురావాలని కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున కాలనీని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

## ఇంటర్, టెన్త్ పరీక్షలు
# పకడ్బందీగా నిర్వహించాలి
## మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**మేడ్చల్ కలెక్టరేట్, క్విక్ టుడే :**
మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్, పదో తరగతి, పబ్లిక్ పరీక్షలు–2024 పరీక్షలు సజావుగా నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ విషయంలో పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా పరీక్ష కేంద్రాల్లో అవసరమైన వసతులు




కల్పించాలని అదనపు కలెక్టర్ అన్నారు. బుధవారం అదనపు కలెక్టరేట్ ఛాంబర్లో తెలంగాణ ప్రభుత్వం ఇంటర్మీడియట్, పదో తరగతి, పబ్లిక్ పరీక్షలు–2024 కు సంబంధించి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి (డీఐవో) కిషన్, జిల్లా విద్యాశాఖ అధికారిణి (డీఈవో) విజయకుమారి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్, పదో తరగతి, పబ్లిక్ పరీక్షలు–2024 నిర్వహణలో అధికారులు సమన్వయంతో తమ విధులు నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలకు 139 పరీక్ష కేంద్రాలను, ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో 65,965, ద్వితీయ సంవత్సరానికి 65,495 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. ఈనెల 28వ తేదీ నుంచి మార్చ్ 19 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు, ప్రథమ సంవత్సరం ఉదయం 9. నుండి మధ్యాహ్నం 12:00 వరకు, ద్వితీయ సంవత్సరానికి మధ్యాహ్నం 2.00 నుండి 5.00 వరకు జరుగుతాయని తెలిపారు. పదో తరగతి పరీక్షలు మార్చ్ 18 నుండి ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్నారని, 231 పరీక్ష కేంద్రాల లో ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు, జిల్లా వ్యాప్తంగా ( రెగ్యులర్ 46834o ప్రైవేట్ 572) 47406 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సౌకర్యాలను కల్పించాలని, స్ట్రాంగ్ రూం నుండి పరీక్షా కేంద్రానికి తిరిగి పరీక్షా కేంద్రం నుండి స్ట్రాంగ్ రూంకు ఎగ్జామ్ మెటీరియల్ తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్షలు నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను, పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని, అవసరమైన పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను, పరీక్షా కేంద్రాల నుండి జవాబు పత్రాలను పగడ్బందీగా తీసుకువెళ్లేందుకు పోస్టల్ శాఖ సహకరించాలని, ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.
పరీక్షలు రాస్తున్న ప్రతి ఒక్క విద్యార్థి పరీక్షా సమయం కన్నా ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ ఎవరికి కూడా అనుమతి లేదని అదనపు కలెక్టర్ తెలిపారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, రాచకొండ, సైబారాబాద్ పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అసంపూర్తి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

## - మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్ కలెక్టరేట్, క్విక్ టుడే :** ఎంపీ ల్యాండ్స్ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో చేపట్టిన పనులలో అసంపూర్తిగా ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం వీసీ మీటింగ్ హాల్లో ఎంపీ లాండ్స్ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో (సిడిపి, ఎంపీ, ఎస్డీఎఫ్, సీబీఎఫ్) చేపట్టిన పనుల పురోగతిపై జిల్లా ప్రణాళికా అధికారి మోహన్ రావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఎక్కడ కూడా పనులు పెండింగ్ లో ఉండకుండా చూడాలని కలెక్టర్ అన్నారు . ఆయా శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనులను చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా నియోజకవర్గ అభివృద్ధి నిధులు (కాన్సిట్యూషన్సీ డెవలప్మెంట్ ఫండ్స్ %-- %సీడీఎఫ్) పార్లమెంట్ ప్రాంత అభివృద్ధి నిధులు (మెంబెర్ అఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డెవలప్మెంట్ %--% ఎంపీ ల్యాడ్స్) క్రుషియల్ బ్యాలెన్స్ ఫండ్ (సీబీఎఫ్), ప్రత్యేక అభివృద్ధి నిధులు (స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ %--% ఎస్డీఎఫ్)కు సంబంధించి జిల్లాలోని రహదారులు భవనాలు, పంచాయతీ రాజ్, అటవీ శాఖ , జిల్లా అభివృద్ధి నిధులు, డీడబ్ల్యువో, డీఆర్డీ ఏ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ అధికారులు అందరూ సమ



న్వయంతో పని చేయాలని అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయగలరని సూచించారు. ఎం పి ల్యాండ్స్ నియోజక వర్గ అభివృద్ధి నిధులతో చేపట్టి అసంపూర్తిగా ఉన్న పనులను ఈ నెల చివరినాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు అధికారులతో అభివృద్ధి పనులపై నియోజకవర్గాల వారీగా పనుల పురోగతిని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. టెండర్ ప్రక్రియలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గ అభివృద్ధి నిధులతో చేపట్టిన పనులు ఎంతవరకు పూర్తి అయ్యాయని పెండింగ్ లో ఎన్ని ఉన్నాయని రద్దు చేసినవి ఎన్ని తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. పనులు పూర్తి చేయడం జరిగిందని, ఇంకా ఎన్ని పనులు ఏఏ స్థాయిలో పెండింగ్ లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా క్యాన్సల్ అయినవి ఎన్ని అనే వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకునే దిశగా అధికారులు కృషి చేయాని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు పూర్తి చేసిన పనులకు సంబంధించిన యూటిలైజేషన్ సర్టిఫికెట్ లను సిపిఓకు పంపాలని అన్నారు. తదుపరి సమావేశానికి అభివృద్ధి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ఆయా శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# వీధి కుక్కల నియంత్రణకు బ్లూక్రాస్ సంస్థతో ఎంఓయూ

## -పీర్జాదిగూడలో కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు





**పీర్జాదిగూడ, క్విక్ టుడే :** వీధి కుక్కల కోసం యాంటీ రేబిస్ టీకాలు ఇచ్చే బ్లూక్రాస్ సంస్థతో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఎంఓయూ చేసుకున్నట్లు మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కమిషనర్ త్రిశేశ్వర్ రావు తెలిపారు. బుధవారం బ్లూ క్రాస్ సంస్థ ప్రతినిధి కుమారితో ఎంఓయూ పత్రాలను కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... వీధి కుక్కల బెడదకు శాశ్వత విముక్తి కల్పించేందుకు మరింత విస్తృతమైన ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గతంలో ఏబీసీ (ఎనిమల్ బర్త్ కంట్రోల్) నందు 50% వీధి కుక్కలకు ఆపరేషన్లు జరిగాయని మిగిలిన వాటికి కూడా పూర్తి చేయాలని, అలాగే ఆపరేషన్లు చేసిన కుక్కలకు కచ్చితంగా రేడియం ట్యాగ్ వేయాలని సూచించారు. ఇతర ప్రాంతాలు, మున్సిపాలిటీల నుంచి అక్రమంగా డంప్ అవుతున్న కుక్కలపై నిఘా పెంచాలని, అధికారులు ఒక నిర్దిష్టమైన ప్రాంతాన్ని ఎంపిక చేసుకొని ఆ ప్రాంతంలోని మొత్తం కుక్కలకు ఆపరేషన్లు చేసిన తరువాత మరో ప్రాంతంలోని కుక్కలకు ఆపరేషన్లు చేయాలని మేయర్ సూచించారు. కుక్క కాటుకు గురైన వెంటనే చికిత్స అందించేలా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యూ.పీహెచ్ సీ, బస్తీ దవాఖానలలో యాంటీ రేబీస్ టీకాలు కూడా అందుబాటులో ఉన్నాయని మేయర్ తెలిపారు.

బ్లూ క్రాస్ ప్రతినిధి కుమారి మాట్లాడుతూ.. యాంటీ రేబిస్ టీకాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల ద్వారా కుక్కల సంఖ్యను తగ్గించడమే సంస్థ ఉద్దేశమన్నారు. మొదటి రోజు 16వ డివిజన్ లోని గణేష్ నగర్ నందు కుక్కలను పట్టే కార్యక్రమాన్ని చేపట్టామని త్వరలో నగరం మొత్తం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి సతీష్ గౌడ్, మేనేజర్ జ్యోతి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ మురళి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారు

## : కడియం శ్రీహరి

**జనగామ :** కాంగ్రెస్ ప్రభుత్వం తమ హామీలను అమలు పరచలేక బీఆర్ఎస్ పార్టీ పై ఎదురుదాడి చేస్తోందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. బుధవారం కడియం శ్రీహరి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను గమనిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అలవికాని హామీలు ఇచ్చి మహిళలను, రైతులను, యువకులను మోసం చేసింది. బీజేపీ నాయకులు చవటలు, దద్దమ్మల్లా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో డిపాజిట్లు దక్కని బీజేపీ పార్టీతో మాకు పొత్తు ఏంటని ప్రశ్నించారు ఎమ్మెల్యే కడియం శ్రీహరి. చిన్న చిన్న పార్టీలను కలుపుకొని పొత్తు పెట్టుకునే దౌర్భాగ్యస్థితి బీజేపీదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారు. మతాల మధ్య కులాల మధ్య చిచ్చులు పెట్టి రాజకీయ పబ్బం గడుపుకునే పార్టీ బీజేపీ అని అన్నారు. సెక్యులర్ పార్టీ అయిన బీఆర్ఎస్ పార్టీ.. బీజేపీతో ఎలాంటి పొత్తు పెట్టుకోదన్నారు. బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ హక్కుల కోసం, గోదావరి జలాల కోసం పోరాటం చేసే పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ బీజేపీ పార్టీలకు ప్రజాసంక్షేమం, అభివృద్ధిపై ధ్యాస లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో




కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ మధ్యే పోటీ ఉంటుందన్నారు. బీజేపీ వారిని హెచ్చరిస్తున్నాం.. మాటలు జాగ్రత్తగా మాట్లాడకపోతే ప్రజలు సరైన రీతిలో బుద్ధి చెబుతారన్నారు ఎమ్మెల్యే కడియం శ్రీహరి.

# కృష్ణా, తుంగభద్ర నదులే పాలమూరు జిల్లాకు జీవనాధారం

## : నిరంజన్ రెడ్డి

**హైదరాబాద్ :** కృష్ణా తుంగభద్ర నదులే పాలమూరు జిల్లాకు జీవనాధారం అని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 360 రోజులు నీటిని ఉపయోగించుకునేలా కేసీఆర్ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ తలపెట్టారు. కొడంగల్, నారాయణ పేటకు నీరు ఇవ్వడానికి పాలమూరు నుంచి రెండు కెనాల్ను ప్రతిపాదించారు. ప్రస్తుతం పాలమూరు రంగారెడ్డిలో కేవలం 7 నుంచి 10 శాతం పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఆ పనులు పూర్తిచేస్తే కొడంగల్, నారాయణ పేటకు గ్రావిటీ ద్వారా నీరు అందించవచ్చు. కానీ ఆ రెండు



కెనాల్స్ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. కొత్తగా రూ.2,900 కోట్లతో ఆ రెండు నియోజకవర్గాల కోసం కొత్త ప్రాజెక్ట్‌కు ప్లాన్ చేసింది. ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ చేస్తున్నారు. కానీ ప్రతిపాదిత నిధుల్లో కేవలం అరవై డెబ్బై శాతం ఖర్చు పెడితే ఓపెన్ కెనాల్‌తో నీరు ఇవ్వొచ్చు. కేసీఆర్ కట్టిన ప్రాజెక్టుతో నీరు ఇవ్వొద్దనే భేషజంతోనే సీఎం రేవంత్ మళ్లీ కొత్త ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టారు అని నిరంజన్ రెడ్డి తెలిపారు. పాలమూరు, రంగారెడ్డి పనులు పూర్తి చేసి నీరిస్తేనే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందన్నారు నిరంజన్ రెడ్డి. జూరాలపై కొత్త ఎత్తిపోతల ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల ప్రజలపై భారం పడుతుంది. బేషజాలకు వెళ్లకుండా కెనాల్స్ పూర్తి చేస్తే తక్కువ ఖర్చుతో నీరు ఇవ్వొచ్చు. శ్రీశైలంకు వచ్చే నీటిని ఆపేసేలా కర్ణాటక ప్రభుత్వం తుంగభద్ర నదిపై బ్యారేజ్ నిర్మాణం తలపెడుతోంది. ముందు దాన్ని అడ్డుకోవడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. కర్ణాటకలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే మాట్లాడి దాన్ని అడ్డుకోవాలి అని నిరంజన్ రెడ్డి సూచించారు. జాతీయ పార్టీల పొత్తుల కోసం అర్రులు చాచటం లేదు.

# ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్రిక్తత..

## రైతులపై మరోమారు టియర్ గ్యాస్ ప్రయోగించిన పోలీసులు



**న్యూఢిల్లీ :** పంటలకు కనీస మద్దతు ధర అంశంలో రైతులు కేంద్రంపై మరోమారు దండయాత్ర ప్రారంభించారు ఛలో ఢిల్లీ పేరిట తమ నిరసనను నేడు తిరిగి ప్రారంభించారు. ఇందులో భాగంగా శంభు సరిహద్దు వద్దకు భారీగా చేరుకొని రాజధానిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్న రైతులను పోలీసులు అడ్డుకున్నారు. రైతులు రాజధానిలోకి ప్రవేశించకుండా ముళ్ల కంచెలు, బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయితే ట్రాక్టర్ల సాయంతో బారికేడ్లను తొలగించి ఢిల్లీలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన రైతులపై పోలీసులు మరోమారు టియర్ గ్యాస్ ప్రయోగించారు. దీంతో సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, రైతులపై హర్యానా పోలీసులు ఇప్పటికే ఓసారి టియర్ గ్యాస్ ప్రయోగించిన విషయం తెలిసిందే. మరోవైపు పోలీసుల తీరుపై రైతులు మండిపడుతున్నారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతామని చెప్పినా పోలీసులు వినిపించుకోలేదని వాపోతున్నారు. తమపై టియర్ గ్యాస్ ప్రయోగించారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శాంతియుత ప్రదర్శనకూ అనుమతివ్వకపోవడంపై వారు మండిపడుతున్నారు.

# కాంగ్రెస్‌తో ఎస్పీ పొత్తు ఖరారు

## : యూపీలో కాంగ్రెస్‌కు 17 స్థానాలు ఆఫర్ చేసిన అఖిలేష్



**హైదరాబాద్ :** రానున్న లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌ల మధ్య పొత్తు ఖరారైంది. ఇండియా విపక్ష కూటమిలో భాగంగా ఇరు పార్టీలు ఎన్నికల్లో కలిసి పోటీచేస్తాయని ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ప్రకటించారు. పొత్తులో భాగంగా యూపీలో 17 ఎంపీ సీట్లను కాంగ్రెస్‌కు కేటాయి ంచేందుకు అఖిలేష్ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఇరు పార్టీల మధ్య పొత్తుకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కీలక పాత్ర పోషించారు. యూపీలో ఎస్పీ, కాంగ్రెస్ మధ్య సీట్ల సర్దుబాటుపై గత రెండు, మూడు రోజులుగా సంప్రదింపులు జరుగుతున్నాయి. అధిక స్థానాలకు కాంగ్రెస్ పట్టుబట్టడంతో సీట్ల సర్దుబాటులో జాప్యం నెలకొంది. ఇక ఇరు పార్టీల పొత్తుపై ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ప్రకటించడంతో ప్రతిష్టంభనకు తెరపడింది. కాంగ్రెస్, ఎస్పీ మధ్య పొత్తు ఖరారు కావడంతో రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రలో అఖిలేష్ యాదవ్ పాల్గొనే అవకాశం ఉందని సమాచారం.

# ఫ్లెక్సిటేరియన్ ఆహారంతో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు




**హైదరాబాద్ :** శాకాహారంతో చేకూరే ఆరోగ్య ప్రయోజనాలను ఆస్వాదిస్తూనే కొన్ని సందర్భాల్లో డైరీ, మాంసం, చేపలు వంటి జంతు సంబంధ ఆహారం తీసుకునేలా డైటీషియన్ డాన్ జాక్సన్ బ్లాట్‌నర్ డిజైన్ చేసిన ఫ్లెక్సిటేరియన్ డైట్ ఆదరణ పొందుతోంది. ఫ్లెక్సిటేరియన్ డైట్ ప్రధా నంగా మొక్కల ఆధారిత ఆహారాలను అధికంగా తీసుకుంటూ పరిమిత స్థాయిలో మాంసం, జంతు సంబంధ ఆహారాన్ని అనుమతిస్తుంది. కఠిన శాకాహార విధానాలకు భిన్నంగా ఇది అందరికీ అనుసరించే రీతిలో ఉంటుంది. మాంసాహారాన్ని పూర్తిగా విడిచిపెట్టకుండా అధికంగా మొక్కల ఆధారిత ఆహారాన్ని తీసుకోవాలనుకునేవారికి ఫ్లెక్సిటేరియన్ ఆహారం మెరుగైన అవకాశమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ ఆహారంతో క్యాలరీలు తక్కువగా ఉండటం, ఫైబర్ అధికంగా ఉండటంతో బరువు పెరగకుండా చూసుకోవచ్చు. ఇక ఫ్లెక్సిటేరియన్ ఆహారంలో కొలెస్ట్రాల్ లెవెల్స్ తకకువగా ఉండటం, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, ఆరోగ్యకర కొవ్వులు అధికంగా ఉండటంతో గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. ఇక ఫ్లెక్సిటేరియన్ డైట్ ప్రయోజనాలను పరిశీలిస్తే..బరువు తగ్గుదల,గుండె ఆరోగ్యం మెరు గు, జీర్ణక్రియ,తీవ్ర అనారోగ్యాల ముప్పునకు చెక్,మెరుగైన శారీరక పటుత్వం,రోగనిరోధక వ్యవస్థ బలోపేతం,మానసిక ఆరోగ్యం మెరుగుదల,వాపు ప్రక్రియకు చెక్,చర్మ సంరక్షణ,దీర్ఘాయువుజి

# తిరుమలలో స్వామివారి సర్వ దర్శనానికి 10 గంటల సమయం



**తిరుమల :** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు దేశం నుంచే కాకుండా ఇతర దేశాల్లో కూడా ఉన్న స్వామివారు భక్తులు తిరుమల చేరుకుంటున్నారు. దీంతో 14 కంపార్టుమెంట్లలో భక్తులు వేచియుండగా టోకెన్లు లేని భక్తులకు 10 గంటల్లో సర్వదర్శనం ( అవుతుందని టీటీడీ అధికారులు వెల్లడించారు. నిన్న స్వామివారిని 62,304 మంది భక్తులు దర్శించుకోగా 20,261 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.61 కోట్ల ఆదాయం వచ్చిందని వివరించారు.

# ఏపీలో డీఎస్సీ దరఖాస్తుల గడువు పెంపు

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ నియమకాల కోసం నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షల దరఖాస్తుల గడువును ప్రభుత్వం మరో మూడు రోజుల పాటు పొడిగించింది. ఈనెల 22 వరకు చివరి తేదీగా నిర్ణయించగా దానిని 25వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది . ఈనెల 12న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా ఫిబ్రవరి 22 చివరి తేదీగా నిర్ణయించింది. సెంకడరీ గ్రేడ్ టీచర్స్ ( ఎస్‌జీటీ), స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ), ట్రేయిన్డ్ గ్యాడ్యుయేట్ టీచర్ పోస్టు గ్యాడ్యుయేట్ టీచర్(పీజీటీ), ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అన్ని కేటగిరిలో కలిపి మొత్తం 6100 పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. మార్చి 5వ తేదీన హాల్‌టికెట్ల జారీ, మార్చి 15 నుంచి 30వ తేదీ వరకు పరీక్షల నిర్వహణ, మార్చి 31న ఆన్సర్ కీ రిలీజ్, ఏప్రిల్ 2న ఫైనల్ కీ రిలీజ్ , ఏప్రిల్ 7న చివరి ఫలితాలను విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

## భారత్-చైనా మధ్య కార్ప్స్ కమాండర్ స్థాయి చర్చలు..



**హైదరాబాద్ :**వాస్తవాధీన రేఖ వెంట సహా సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, సుస్థిరతను కొనసాగి ంచేం దుకు భారత్, చైనా అంగీకరిం చాయి. ఈ వాం ˘ంలో జరిగిన అత్యున్నత స్థాయి సైనిక చర్చల్లో ఇరుదేశాల మధ్య అంగీ కారం కుదిరింది. అ యితే, చర్చల్లో మూడే న్నరేళ్లుగా కొనసాగుతున్న వివాద పరిష్కారంపై స్పష్టమైన ముగింపును కనుగొనలేకపోయారు. భారత్-చైనా మధ్య 21వ కార్ప్స్ కమాండర్‌స్థాయి చర్చలు ఈ నెల 13న చుషుల్-మోల్డో బోర్డర్‌లో మీటింగ్ పాయింట్‌లో జరిగినట్లు విదేశీ వ్యవహారాల మం త్రిత్వ శాఖ తెలిపింది.సరిహద్దు ప్రాంతాల నుంచి ఇరుదేశాల సైన్యాలను ఉపసం హరిం చుకో వడంపై గత పర్యటనల్లో జరిగిన చర్చలు భారత్-చైనా మధ్య సరిహద్దులో శాంతికి ముఖ్యమైన ప్రాతిపదిక అని మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. చర్చల సందర్భంగా ఇరుదేశాలు తమ అభిప్రాయాలను పరస్పరం స్నేహపూర్వకంగా ముందుంచాయని తెలిపింది. మధ్యంతర కాలంలో సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, సుస్థిరతను కాపాడేందుకు ఇరు పక్షాలు కట్టుబడి ఉన్నాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## ఏఐ ఫీచర్స్‌తో తొలి స్మార్ట్‌వాచ్
### లాంచ్ చేయనున్న లావా



**న్యూఢిల్లీ :** ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ లావా తొలి స్మార్ట్‌వాచ్‌ను లాంఛ్ చేసేందుకు సన్నాహాలు చేపట్టింది. భారత్‌కే ప్రత్యేకంగా లాంఛ్ చేసే ఈ స్మార్ట్‌వాచ్‌లో ఏఐ ఫీచర్స్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని సమాచారం. ఈ ఏఐ ఆధారిత స్మార్ట్‌వాచ్ ధర రూ. 4000లోపు ఉం టుందని, ఇది అన్ని స్టోర్స్‌తో పాటు ఆన్‌లైన్‌లోనూ లభిస్తుందని చెబుతున్నారు.ఇప్పటికే స్మార్ట్‌వాచ్‌లను విక్రయిస్తున్న ఫైర్ బోల్ట్, నాయిస్, బోట్ వంటి బ్రాండ్స్‌కు దీటుగా లావా తన స్మార్ట్‌వాచ్‌ను లాంఛ్ చేయనుంది. ప్రస్తుతం బేసిక్ ఫోన్లు, స్మార్ట్‌ఫోన్లకే పరిమితమైన లావా స్మార్ట్‌వాచ్ మార్కెట్‌లోకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వడం హాట్ టాపిక్‌గా మారింది.షియామి, ఒప్పో, వన్‌ప్లస్, వివో వంటి ఇతర స్మార్ట్‌ఫోన్ కంపెనీలు ఇప్పటికే స్మార్ట్‌వాచ్‌లు, ఇతర వియర్‌బుల్ గాడ్జెట్స్‌ను విక్రయిస్తున్నాయి. ఇక రూ. 10,000 రూ. 20,000 ధరల శ్రేణిలో లావా ప్రస్తుతం వేగంగా ఎదుగుతున్న స్మార్ట్‌ఫోన్ బ్రాండ్‌గా నిలిచిందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ డేటా వెల్లడిస్తోంది. ఇక స్మార్ట్‌వాచ్ సెగ్మెంట్‌లోనూ తనదైన ముద్ర వేసేందుకు లావా భారీ ప్రణాళికతోనే ఎంట్రీ ఇస్తున్నట్టు చెబుతున్నారు.

## కాంగ్రెస్ ఎస్పీ పొత్తు వెనుక ప్రియాంక హస్తం..!



**న్యూఢిల్లీ :** ఏప్రిల్, మే నెలల్లో జరగబోయే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్టీల మధ్య పొత్తులు పొడుస్తున్న సంగతి తెలిసిందే. అయితే కాంగ్రెస్ సమాజ్‌వాది పార్టీ పొత్తుపై గత కొద్ది రోజుల నుంచి నీలినీడలు కమ్ముకున్న విషయం విదితమే. ఎట్టకేలకు సీట్ల సర్దుబాటు విషయంలో ఇరు పార్టీల మధ్య సయోధ్య కుదిరింది. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా కీలకపాత్ర పోషించినట్లు తెలిసింది.అయితే జోడో న్యాయ యాత్రలో ఉన్న రాహుల్ గాంధీతో ప్రియాంక పలు దఫాలుగా చర్చించారు. అనంతరం ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌తో చర్చలు జరిపి పొత్తు వ్యవహారంతో పాటు సీట్ల పంపకాన్ని ఆమె కొలిక్కి తీసుకొచ్చారు. 80 లోక్‌సభ స్థానాలు ఉన్న యూపీలో 17 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేయబోతోంది. అయితే మొర్దాబాద్ ఎంపీ సీటు కావాలని కాంగ్రెస్ పట్టుబట్టింది. కానీ అందుకు ఎస్పీ అంగీకరించలేదు. మొం ్దాబాద్ సీటు కేటాయించని పక్షంలో సీతాపూర్, శ్రవస్తి, వారణాసి స్థానాలు తమకు ఇవ్వాలని కాంగ్రెస్ కోరడంతో చర్చలు ముందుకు సాగాయి. మొత్తానికి ఎస్పీ అంగీకరించడంతో కాంగ్రెస్‌తో పొత్తు కుదిరింది.అమేథి, రాయ్ బరేలి, ప్రయాగ్‌రాజ్, వారణాసి, మహారాజ్‌గంజ్, డియోరియా, బాన్స్‌గావ్, సీతాపూర్, అమ్రోహా, బులంద్‌షర్, ఘజియాబాద్, కాన్పూర్, ఝాన్సీ, బారాబంకీ, ఫతేపూర్ సిక్రీ, షాహారన్‌పూర్, మథుర నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పోటీ చేయనుంది. త్వరలోనే ఎస్పీ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేసిన పొత్తులపై ప్రకటన చేయనున్నారు.

## ఆపరేషన్ థియేటర్‌లో గుట్కా నలిచిన రోగి..
### అనస్థీషియా మత్తులో అలా చేశాడా..?



**హైదరాబాద్ :**ఆపరేషన్ థియేటర్‌లో సర్జరీకి సంబంధించిన మెటీరియల్ తప్ప ఎలాంటి వస్తువులకు అను మతి ఉండదు. అంతేకాదు రోగి వద్ద కూడా ఎలాంటి వస్తువును ఉండనివ్వరు. చివరకు మొలతాడును కూడా ఉండనివ్వరు వైద్యులు. కానీ ఈ రోగి మాత్రం ఆపరేషన్ థియేటర్‌లో బెడ్‌పై పడుకుని, గుట్కా నలిచాడు. మరి ఆ రో గికి గుట్కా ఎక్కడ్నుంచి వచ్చిందనేది తెలియరాలేదు. రోగి గుట్కా నలిచిన దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ ఘటన కాన్పూర్‌లోని ఓ ఆస్పత్రిలో చోటు చేసుకున్నట్లు ఈ వీడియోను షేర్ చేసిన వ్యక్తి తెలిపాడు. కానీ కచ్చితంగా కాన్పూర్‌లోనే జరిగిందా? అనేది మాత్రం నిర్ధారణ కాలేదు.ఆస్పత్రి ఆపరేషన్ థియేటర్‌లో బెడ్‌పై ఉన్న వ్యక్తికి ఏదో చికిత్స చేసేందుకు ఇద్దరు నర్సులు సిద్ధమవుతున్నారు. ఆ సమయంలో రోగి గుట్కా నలిచినట్లు స్పష్టంగా ఉంది. అయితే అప్పటికే రోగికి అనస్థీషియా ఇచ్చారు. ఇక రోగి ఆక్సిజన్ మాస్కును కూడా ధరించాడు. ఎడమ చేతి వేలికి పల్స్ మెషీన్ కూడా ఉంది. ఒక నర్సు అతనికి ఇంజక్షన్ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు కనిపించింది.ఈ వీడియోపై నెటిజన్లు మండిపడుతున్నారు. గుట్కాను ఆపరేషన్ థియేటర్‌లోకి ఎలా అనుమతిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి చర్యలను ఉపేక్షించరాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆ రోగి అనస్థీషియా మత్తులో అలా చేసి ఉండొచ్చని కొందరు భావిస్తున్నారు. కానీ దీనిపై స్పష్టత లేదు. అతని చేతిలో నిజంగానే గుట్కా ఉందా..? లేదా..? అనేది కూడా తెలియరాలేదు.

## ఏపీలో ఏసీబీ సోదాలు..
### లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారులు



**అమరావతి :** ఏపీలోని రెండు జిల్లాలో ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వివ రాలకు వెళితే.. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలంలో ఓ రైతు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం గ్రామీణ విద్యుత్ ఏఈ ప్రకాష్ నాయక్‌ను సం పదించాడు. దీంతో ఏఈ లంచం డిమాండ్ చేయగా రైతు ఏసీబీని ఆశ్రయించాడు. బుధవారం కార్యాలయంలో ఏఈ రూ. 55 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.అదేవిధంగా నెల్లూరు జిల్లా కొండాపురం పోలీస్ స్టేషన్‌పై ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. బాధితుడి నుంచి అందిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసులో వ్యక్తి నుంచి రూ. 30 వేలు లంచం తీసుకున్న ఎస్ఐ ఖాజావలిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

# ఖనౌరీ సరిహద్దుల్లో కాల్పులు..
# ఇద్దరు రైతుల మృతి..!

**హైదరాబాద్ :** కేంద్రం ప్రతిపాదనలకు రైతులు నిరాకరిస్తూ ఆందోళన మరింత ఉధృతం చేశారు. హైడ్రాలిక్ క్రేజలు, జేసీబీలు, ప్రొక్లెయినర్స్ తదితర భారీ యంత్రాలను శంభు సరిహద్దులకు తరలించారు. దాంతో పోలీసులు రైతులను అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో రైతులు, పోలీసుల మధ్య ఘర్షణ కాల్పులకు దారి తీసింది. ఈ ఘటనలో ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోయారు. జింద్ డేటా సింగ్ వాలా సరిహద్దులో జరిగిన ఘర్షణలో మరో 20 మంది వరకు రైతులు గాయాలపాలయ్యారు.పోలీసులు పలువురు రైతులను అరెస్టు చేసి హర్యానాకు తరలించారు. ఈ క్రమంలో రైతులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. పలువురు రైతులు పొలాల గుండా సరిహద్దు దాటేందుకు యత్నిస్తుండగా పోలీసులు లాఠీచార్జి చేశారు. ఓ వైపు భాష్పవాయుగు గోళాలను ప్రయోగించారు. మరో వైపు శంభు సరిహద్దుల్లో రైతుల చర్చలు కొనసాగుతున్నాయి. ఇటీవల చండీగఢ్‌లో జరిగిన సమావేశంలో కేంద్రం మంత్రులు చేసిన ప్రతిపాదనలు రైతు సంఘాలు తిరస్కరించాయి. ఈ క్రమంలోనే కేంద్రమంత్రి అర్జున్ ముండా రైతులను చర్చలకు ఆహ్వానించారు.రైతులతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని.. రైతులను చర్చలకు ఆహ్వానిస్తున్నామన్నారు. కనీస మద్దతు ధర, పంట మార్పిడి, వ్యర్థాల దహనంపై రైతులతో చర్చకు సిద్ధమని ప్రకటించారు. అయితే, కేంద్రంతో చర్చల విషయంలో రైతు సంఘాలు ఏకగ్రీవంగా సమ్మతించడం లేదు. పలువురు రైతు నేతలు చర్చలకు సిద్ధమైనా.. ఇప్పటి వరకు ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో ఏ సమస్య పరిష్కారం కాలేదని మరికొందరు నేతలు



పేర్కొంటున్నారు. అయితే, చాలామంది రైతులు శాంతియుతంగా నిరసన తెలుపుతున్నా.. యువ రైతులు మాత్రం పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటేందుకు ప్రయత్నిస్తున్నారు.

# మగువలకు భారీ షాక్..!
## పెరిగిన బంగారం, వెండి ధరలు..!

**హైదరాబాద్:**అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర వారం గరిష్ఠానికి చేరింది. ప్రస్తుతం ఔన్స్ గోల్డ్ ధర 2,042 డాలర్ల వద్ద కొనసాగుతున్నది. ఫెడ్ మినిట్స్ రిలీజ్‌తో పాటు, యూఎస్ డాలర్ బలహీన పడడంతో బంగారం ధర పెరిగింది. ఈ క్రమంలో భారత్‌లోనూ బంగారం ధరలు పెరిగాయి. 22 క్యారెట్ల గోల్డ్‌పై రూ.250 పెరగ్గా.. 24 క్యారెట్ల బంగారంపై రూ.180 వరకు ఎగిసి ంది.ప్రస్తుతం 22 క్యారెట్ల పసిడి తులానికి రూ.57,600కి పెరిగింది. 24 క్యారెట్ల పుత్తడి రూ.62,740కి చేరింది. అదే సమయంలో వెండి ధర సైతం స్వల్పంగా పైకి కదిలింది. దేశంలోని పలు నగరాల్లో బంగారం ధరలను పరిశీలిస్తే.. చెన్నైలో 22 క్యారెట్ల గోల్డ్ రూ.58,100 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం రూ.63,380కి చేరింది. ముంబయిలో 22 క్యారెట్ల పసిడి రూ.57,600 ఉండగా.. 24 క్యారెట్ల స్వర్ణం రూ.62,740కి పెరిగింది. ఢిల్లీలో 22 క్యారెట్ల పుత్తడి రూ.57,750 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం రూ.62,740కి చేరింది.

హైదరాబాద్‌లో 22 క్యారెట్ల పసిడి రూ.57,600 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం రూ.62,740కి పెరిగింది. ఏపీలోని విజయవాడ, కేరళ, బెంగళూరు, పుణే నగరాల్లోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. మరో వైపు పుత్తడి కిలోకు రూ.200 వరకు పెరిగి.. రూ.75,700 వద్ద ట్రేడవుతున్నది. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.77,200 పలుకుతున్నది. అదే సమయంలో ప్లాటినం ధరలు స్థిరంగా కొనసాగుతున్నది. తులానికి రూ.24,100 వద్ద నిలకడగా ఉన్నది.



# సింధ్ నదిని ముంచెత్తిన అవలాంచ్.. రోడ్లపైకి నీరు

**హిమాచల్ ప్రదేశ్ :**ఉత్తరాదిపై గత కొన్ని రోజులుగా భారీగా మంచు పడుతోంది. జమ్మూ కశ్మీర్ హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో అడుగుల మేర మంచు పేరుకుపోయింది. ఈ క్రమంలో అక్కడక్కడా అవలాంచ్‌లు ఏర్పడుతున్నాయి.తాజాగా జమ్మూ కశ్మీర్‌లోని సోన్‌మార్గ్ భారీ హిమపాతం (అవలాంచ్, మంచు ఉప్పెన) ముంచెత్తింది. ఈ మంచు మొత్తం సింధ్ నది పడటంతో నదీ ప్రవాహం ఎక్కడికక్కడ నిలిపోయింది. ఆ నీరంతా రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు నదిపై మంచు తొలగింపు పనులు చేపట్టారు. యంత్రాలను ఏర్పాటు చేసి మంచును తొలగిస్తున్నారు.కశ్మీర్ ప్రాంతంలో అవలాంచ్‌లు ఏర్పడటం సర్వసాధరణమే.

అక్కడ రికార్డు స్థాయిలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. అలాంటి సమయంలోనే అక్కడక్కడా అవలాంచ్‌లు ఏర్పడతాయి. భారీ ఎత్తున మంచు ఒక్కసారిగా విపరీతమైన వేగంతో కొండలపై నుంచి కిందకు రావడాన్ని అవలాంచ్ (మంచు తుపాను) అంటారు. దీనివల్ల ఒక్కోసారి ప్రాణ నష్టం ఎక్కువగా ఉంటుంది.



# ప్రమాదమా? కుట్ర కోణమా?
## ప్రభుత్వం విచారణ చేపట్టాలి
## : వినోద్‌కుమార్

**కరీంనగర్ :**అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌కోరారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా..? లేక ఏమైనా కుట్ర కోణం ఉన్నదా..? అన్న కోణంలో పోలీసులు పూర్తి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ 42వ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్, ఆదర్శనగర్ మధ్య మంగళవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం జరిగి గుడిసెలు బుగ్గి కాగా, బుధవారం బాధితులను ఆయన పరామ ర్శించారు.ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.

తక్షణ అవసరాల కోసం లక్ష ఆర్థిక సాయం అందించారు. అధైర్య పడొద్దని, పేదలను ఆదుకునేందుకు అన్ని విధాలుగా సాయం చేస్తామని భరోసానిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించి తగిన న్యాయం చేయాలని కోరారు. బాధితులకు వెంటనే తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసేలా చూడా లన్నారు.అందుకు తాము కృషి చేస్తామని చెప్పారు. ముప్పై ఏండ్లుగా ఈ నిరుపేదలు ఇక్కడే జీవిస్తున్నారని, గతంలో చాలా మంది వచ్చి ఈ స్థలాన్ని ఖాళీ చేయాలని వారిని ప్రలోభాలకు గురి చేశారని పేర్కొన్నారు. కూలీల గుడిసెలు అగ్నిప్రమాదంలో



దగ్ధం కావడం బాధకరమని ఆవేదన చెందారు.

# వృద్ధికి కార్పొరేట్ జోష్ కార్పొరేట్ రంగం నుంచి వచ్చే కొత్త పెట్టుబడి వ్యయం

**ముంబై :** కార్పొరేట్ రంగం నుంచి వచ్చే కొత్త పెట్టుబడి వ్యయం.. దేశ జీడీపీ వృద్ధిరేటును మరింత బలోపేతం చేసే వీలుందని తాజా బులెటిన్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అభిప్రాయపడింది. ప్రైవేట్ పెట్టుబడులే వృద్ధిరేటుకు ఇంధనంగా అభివర్ణించింది. తక్కువ స్థాయిలో 4 శాతంతో స్థిరంగా ఉండే ద్రవ్యోల్బణం.. నిలకడైన జీడీపీ విస్తరణకు పునాదిగా మార గలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసింది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను చివరి, ఆరో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఈ నెలారంభంలో ఆర్బీఐ నిర్వహి ంచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆర్బీఐ ఫిబ్రవరి బులె టిన్ విడుదలైంది. ఇందులో 'దేశ ఆర్థిక వ్యవస్థ' పేరుతో వచ్చిన ఆర్టికల్‌లో ఈ ఏడాది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి ఊహి ంచినదానికంటే బలంగా ఉండవచ్చని ఆర్బీఐ అంచనా వేసింది. ఇటీవలి నెలల్లో ఈ సంకేతాలున్నాయన్నది.ఇక దేశ ఆర్థిక వ్యవస్థ నిలకడైన తీరు.. ఈ 2023-24 ప్రథమార్థం (ఏప్రిల్-సెప్టెం బర్)లోనూ కొనసాగినట్టు చెప్పింది. ఈ నేపథ్యంలోనే 'తదుపరి జీడీపీ వృద్ధికి కార్పొరేట్లు చేసే తాజా మూలధన వ్యయం ఇం ధనం కాగలదు' అని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్లలో ఒకరైన మైఖేల్ దేబబ్రత పాత్ర అన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటిదాకానైతే ప్రైవేట్ రంగంలో పెట్టు బడుల ఆలోచనలు అనుకూలంగానే ఉన్నట్టు చెప్తున్నారు.రూ.2.4 లక్షల కోట్లుగత ఏడాది ఏప్రిల్-డిసెంబర్ వ్యవధి,లో ప్రధాన



బ్యాంకులు/అఖిల భారత ఆర్థిక సంస్థలు జారీ చేసిన రుణాలకు సంబంధించిన ప్రాజెక్టుల మొత్తం విలువ రూ.2.4 లక్షల కోట్లుగా ఉన్నది. 2022 ఏప్రిల్-డిసెంబర్‌తో పోల్చితే ఇది 23 శాతం ఎక్కువ. ఇక ఈ ఆర్థిక సంవత్సరం రెండో, మూడో త్రైమాసికంలో పెట్టుబడుల కోసం ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ (ఈసీబీలు), ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్లు (ఐపీవో) చురుగ్గా సాగినట్టు ఆర్బీఐ బులెటిన్ పేర్కొన్నది.అయితే తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో సమీకరించిన నిధులతో పోల్చితే తక్కువేనని స్పష్టం చేసింది. కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2024-25) గాను దేశ జీడీపీని ఆర్బీఐ 7 శాతం గా అంచనా వేసింది. అలాగే వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 4.5 శాతంగా ఉండొచ్చన్నది.అయినప్పటికీ ఆహా రోత్పత్తుల ధరల్లో తరచూ చోటుచేసుకుంటున్న పెరుగుదలతో ఇబ్బందేనని ఆర్బీఐ వ్యాఖ్యానించింది. అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్లు, వస్తూత్పత్తి ధరల్లో ఒడుదొడుకులూ సమస్యల్ని పెద్దవి చేస్తున్నట్టు పేర్కొన్నది. ఈ నెల ద్రవ్యసమీక్షలోనూ ఆర్బీఐ కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచినది తెలిసిందే. రెపోరేటును 6.5 శాతం వద్దే ఉంచగా, రుణ భారం తగ్గేందుకు ఇక ముందు ద్రవ్యసమీక్షల్లోనైనా వడ్డీరేట్ల కోతకు దిగాలని కార్పొరేట్లు కోరుతున్నారు. ఐఎంఎఫ్ అంచనాతో విభేదందేశ డెట్-జీడీపీ నిష్పత్తిపై అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) అంచనాల్ని ఆర్బీఐ తోసిపుచ్చింది. 2030-31 నాటికి జనరల్ గవర్నమెంట్ డెట్-జీడీపీ రేషియో 73.4 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ దేబబ్రత పాత్ర అన్నారు.

ఐఎంఎఫ్ దీన్ని 78.2 శాతంగా అం చనా వేసింది. కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2024-25) గాను ఈ నెల 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మ లా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో కేంద్ర ప్రభు త్వ స్థూల ద్రవ్యలోటును దేశ జీడీపీలో 5.1 శాతంగా అంచనా వేశారు. 2025-26లో దీన్ని జీడీపీలో 4.5 శాతానికి తగ్గిం చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# 17 కోట్లకు ఫండ్స్ ఖాతాలు మ్యూచువల్ ఫండ్స్‌లో మదుపుచేసే ఇన్వెస్టర్ల సంఖ్య జోరుగా పెరుగుతున్నది

**న్యూఢిల్లీ :** మ్యూచువల్ ఫండ్స్‌లో మదుపుచేసే ఇన్వెస్టర్ల సంఖ్య జోరుగా పెరుగుతున్నది. ఈ మదుపు సాధనం పట్ల అవగాహన పెరగడం, డిజిటలైజేషన్‌తో లావాదేవీలు సులభతరంకావడంతో ఫండ్స్ మదుపుదారులను ఆకర్షించగలుగుతున్నాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫి) తాజా గణాంకాల ప్రకారం ఈ ఏడాది జనవరిలో మ్యూచువల్ ఫండ్ పరిశ్రమకు కొత్తగా 46.7 లక్షల ఇన్వెస్టర్ల ఖాతాలు జతయ్యాయి.ఏడాది క్రితం సగటున నెలకు 22.3 లక్షల ఫోలియోలు జతకాగా, ఈ జనవరిలో అంతకు రెట్టింపు తెరవడం గమనార్హం. కొత్తగా తెరిచిన ఖాతాలతో మొత్తం మ్యూచువల్ ఫండ్స్ ఫోలియోలు 16.96 కోట్లకు చేరాయి. 2023 జనవరి ముగింపునాటికి మొత్తం ఫోలియోల సంఖ్య 14.28 కోట్లుకాగా, అవి ప్రస్తుతం 19 శాతం వృద్ధిచెందాయి. 2023 డిసెంబర్‌లో 16.49 కోట్ల ఫోలియో నంబర్ల నుంచి 3 శాతం పెరి గాయి. వ్యక్తిగత ఇన్వెస్టర్ల ఖాతాలకు డిజిగ్నేట్ చేసేవే ఫోలియో నంబర్లు. ఒకే ఇన్వెస్టరు ఎన్ని ఫోలియోలైనా తెరవవచ్చు. ఆర్థిక అక్షరాస్యత పెరుగుదల, అధిక ఆదాయాలు, డిజిటైజేషన్ విస్తృతితో దేశంలో ఇన్వెస్టర్లు సాంప్రదాయ పొదుపు సాధనాలైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పోస్టాఫీసు సేవింగ్స్ స్కీమ్స్‌కంటే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబ




డులకు మొగ్గు చూపిస్తున్నారని వైట్‌వోక్ మ్యూ చువల్ ఫండ్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ప్రతీక్ పంత్ చెపా రు.నవతరం నేతృత్వంకొద్ది సంవ త్సరాలుగా పెరుగుతున్న మ్యూ చువల్ ఫండ్ ఫోలియోలకు కొత్త తరం జెన్-వై, జెన్-జడ్ ఇన్వె స్టర్లు నేతృత్వం వహిస్తున్నారు. 1981-1996 మధ్య జన్మిం చినవారు మిల్లెనియల్స్ (జెనరేషన్-వై ఇన్వెస్టర్లు)కాగా, 19997-2012 మధ్య పుట్టినవారిని జెన్-జడ్‌గా వ్యవహరిస్తుంటారు. కొత్త ఇన్వెస్టర్లలో అధికశాతం మ్యూచువల్ ఫండ్స్‌లోకి డిజిటల్ చానళ్ల ద్వారా ప్రవేశిస్తున్నారని పంత్ వెల్లడించారు.జనవరిలో వచ్చిన 46 లక్షల ఫోలియోల్లో 34.7 లక్షల ఫోలియోలు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌వే. మొత్తం ఫండ్ ఖాతాల్లో ఈక్విటీ ఫోలియోలు 11.68 కోట్లకు (69 శాతం వాటా) చేరినట్టు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తెలిపింది. డెట్ మ్యూచువల్ ఫండ్స్‌కంటే ఈక్విటీలపైనే మదుపుదారుల ఆసక్తి అధికంగా ఉందనడానికి ఇది నిదర్శనమని ఫండ్ విశ్లేషకులు చెప్పారు. 2024 జనవరిలో హైబ్రీడ్ ఫండ్స్ (డెట్, ఈక్విటీలు రెండింటిలోనూ ఇన్వెస్ట్ చేసేవి) 3.36 లక్షల ఫోలియోలు జతచేసుకోవడంతో వాటి మొత్తం ఫోలియోల సంఖ్య 1.31 కోట్లకు పెరిగాయి.మరోవైపు డెట్ స్కీమ్‌ల్లో ఫోలియోల సంఖ్య వరుసగా ఐదో నెలలోనూ తగ్గింది. వీటి మొత్తం సంఖ్య 74.66 లక్షలకు పరిమితమయ్యింది. ఫోలియోల సంఖ్య కొద్ది సంవత్సరాల నుంచి ఎంతగా పెరిగినప్పటికీ, దేశంలో ఫండ్స్‌లో పెట్టేవారు చాలా తక్కువేనని పరిశ్రమ విశ్లేషకులు పేర్కొంటున్నారు. భారత జనాభాలో మ్యూచువల్ ఫండ్ మదుపుదారులు 3 శాతంలోపేనని వారు గుర్తుచేశారు. ప్రస్తుత దేశీయ మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నిర్వహణలో రూ.53 లక్షల కోట్ల ఆస్తులు ఉన్నాయి.

# గగన్‌యాన్‌లో ఇస్రో మరో ముందడుగు..! మిషన్ కోసం సీఈ20 క్రయోజెనిక్ ఇంజిన్ సిద్ధం..!

**హైదరాబాద్ :** చంద్రయాన్-3, మిషన్ ఆదిత్య ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించి సరికొత్త చరిత్ర సృష్టించింది భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ మరో ప్రయోగానికి మిషన్‌కు సన్నద్ధ మవుతున్నది. ప్రస్తుతం గగన్‌యాన్ మిషన్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ మిషన్‌లో తొలిసారిగా అంతరిక్షయాత్ర చేపట్టనుండగా.. ఈ కీలకమైన ప్రాజెక్టులో ఇస్రో మరో ముం దడుగు వేసింది. మిషన్ కోసం ఎల్‌వీఎం-3 లాంచ్ వెహికిల్ క్రయోజనిక్ ఇంజిన్‌ను ఇస్రో వాడనున్నది. సీఈ20 క్రయోజనిక్ ఇంజిన్ గగన్‌యాన్ మిషన్‌కు సిద్ధంగా ఉందని ఇస్రో తెలిపింది.అనేక కఠినమైన పరీక్షల తర్వాత సీ20 క్రయోజనిక్ ఇంజిన్ భద్రతా ప్రమాణపత్రాన్ని పొందిందని తెలిపింది. తొలి మానవరహిత ఫ్లయిట్ ఎల్‌వీఎం-3 జీ1 కోసం సిద్ధం చేసిన సీఈ20 క్రయోజనిక్ ఇంజిన్ అన్ని పరీక్షల తర్వాత సర్టిఫికెట్ పొందిందని.. ఈ ప్రక్రియ ఈ నెల 13న చివరి దశ క్వాలి ఫికేషన్ పరీక్షలు పూర్తయ్యిందని బుధవారం ఇస్రో ప్రకటించింది. మనుషులను సురక్షితంగా





తీసుకెళ్లడానికి ఎల్‌విఎం3 రాకెట్‌కు శక్తినిచ్చే సీఈ20 క్రయోజెనిక్ ఇంజిన్ మానవ రేటింగ్‌లో ప్రధాన మైలురాయిని సాధించిందని భారత అంతరిక్ష సంస్థ ఇస్రో తెలిపి ంది.మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లోని హై ఆల్టి ట్యూడ్ టెస్ట్ ఫెసిలిటీలో నిర్వహించిన వాక్యూమ్ ఇగ్నిషన్ పరీక్షల శ్రేణిలో ఇది ఏడోది. ఇదిలా ఉండగా.. 2024 గగన్ యాన్‌కు సన్నాహక సంవత్సరమని ఇస్రో చైర్మన్ సోమ్‌నాథ్ ఈ ఏడాది ప్రారంభంలో పేర్కొన్నారు. గగన్‌యాన్ మిషన్ కోసం హెలీకాప్టర్ నుంచి డ్రాప్ టెస్ట్ నిర్వహిస్తామని తెలిపారు. ఇందు లో ప్యారాచూట్ సిస్టమ్‌ను టెస్ట్ చేయనున్నట్లు పేర్కొన్నారు. దాం తో పాటు పలు డ్రాప్ టెస్టులు నిర్వహించన్నుట్లు పేర్కొన్నారు. వీటితో పాటు పలు వాల్యుయేషన్ పరీక్షలు సైతం జరు గుతా యన్నారు.గగన్‌యాన్ మిషన్‌లో ఇస్రో వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపనున్నది. ముగ్గురు వ్యోమగాములను దాదాపు 400 కిలోమీటర్ల ఎత్తయిన కక్ష్యలోకి చేర్చి.. తిరిగి వారిని భూమిపైకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ ప్రయోగం మూడు రోజులపాటు జరుగనున్నది. వ్యోమగాములు తిరుగు ప్రయా ణంలో సముద్రంపై సురక్షితంగా దిగాల్సి ఉంటుంది. ఈ మిష న్‌ను 2025లో చేపట్టాలని భావిస్తున్నది. వాస్తవానికి 2022లోనే ప్రాజెక్టు చేపట్టాల్సి ఉండగా.. కరోనా కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఇస్రో చేపట్టిన మిషన్ విజయవంతమైతే అమె రికా, చైనా, సోవియట్ యూనియన్ తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ అవతరించనున్నది.

# అన్నదాతలకు ఆసరాగా నిలుస్తాం : మల్లికార్జున్ ఖర్గే

**హైదరాబాద్ :** కనీస మద్దతు ధరకు (ఎంఎస్‌పీ) చట్టబద్ధత కల్పించాలని కోరుతూ అన్నదాతలు చేపట్టిన ఆందోళనకు కాంగ్రెస్ అన్నిరకాలుగా బాసటగా నిలుస్తుందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లింకార్జున్ ఖర్గే బుధవారం స్పష్టం చేశారు. నిరసనలకు దిగిన రైతులకు కాంగ్రెస్ పార్టీ వెన్నంటి ఉంటుందని, వారి న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని తమ పార్టీ కోరుతోందని ఆయన వివరించారు.రైతుల సమస్యలను తాము ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరుస్తామని, ఎంఎస్‌పీ కోసం చట్టాన్ని తీసుకువస్తామని ఖర్గే హామీ ఇచ్చారు. రైతులకు ప్రభుత్వం అందించే ఎంఎస్‌పీని రెట్టింపు చేస్తామని 2014 ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటివరకూ ఆ హామీ ఊసెత్తలేదని అన్నారు.

ఎంఎస్‌పీ అమలు చేయాలని రైతులు ఎప్పటినుంచో కోరుతున్నా మోదీ సర్కార్ పట్టించుకోలేదని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ జితూ పట్వారి ఆందోళన వ్యక్తం చేశారు.ఇక ఎంఎస్ స్వామినాధన్ నివేదిక సిఫార్సులను మోదీ ప్రభుత్వం గాలికొ దిలేసిందని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ




అంతకుముందు కాషాయ పాలకులపై విరుచుకుపడ్డారు.

## ఆరు రోజుల లాభాలకు బ్రేక్..! 434.30 పాయింట్లు పతనమైన సెన్సెక్స్



**న్యూఢిల్లీ:** దేశీయ స్టాక్ మార్కెట్లలో వరుస ఆరో రోజుల లాభాలకు బ్రేక్ పడింది. బుధవారం బెంచ్ మార్క్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ ఇవాళ ఉదయం 73,267.48 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. సెన్సెక్స్ భారీగా పెరడంతో ఐటీ, ఫైనా న్షియల్, ఫార్మారంగాల భారీగా అమ్మకాలు జరిగాయి. దాంతో ప్రారంభంలో వచ్చిన లాభాలన్నీ ఆవిరయ్యాయి. ఒక దశలో 73,267.80 పాయింట్ల గరిష్ఠానికి చేరుకున్న సెన్సెక్స్.. ఇంట్రాడేలో 72,450.56 పాయింట్ల కనిష్ఠానికి చేరుకున్నది. చివరకు 434.30 పాయింట్ల నష్టంతో 72,623.09 వద్ద ముగిసింది.నిఫ్టీ సైతం 141.90 పాయింట్ల నష్టంతో 22,055.05 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,227 షేర్లు పురోగమించగా.. 2078 షేర్లు క్షీణించాయి. 69 షేర్లు మాత్రం మారలేదు. నిఫ్టీలో బీపీసీఎల్, కోల్ ఇండియా, హీరో మోటోకార్ప్, పవర్ గ్రిడ్ కార్ప్, ఎన్ టీపీసీ అత్యధికంగా నష్టపోయాయి. టాటా స్టీల్, ఎస్‌బీఐ, జెఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే రియాల్టీ, పీఎస్‌యూ బ్యాంక్ మినహా మిగిలిన అన్ని సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. బీఎస్‌ఈలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కోశాతం చొప్పున పడిపోయాయి.

## భారత్‌లో 250 మంది ఉద్యోగులపై నోకియా వేటు




**న్యూఢిల్లీ:** స్మార్ట్‌ఫోన్ పరిశ్రమలో పాపులర్ బ్రాండ్ నోకియా భారత్‌లో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. పునర్వ్యవస్థీకరణ ప్రణా ళికల్లో భాగంగా భారత్‌లో 250 మంది ఉద్యోగులపై వేటు పడనుంది. నోకియా చేపట్టిన మార్పుల కారణంగా వందలాది ఉద్యోగులు కొలువులు కోల్పోవాల్సిన పరిస్థితి నెల కొంది.నోకియా 5జీ టెక్నాలజీ పట్ల భారత్‌లో డిమాండ్ తగ్గడంతో కంపెనీ పలు సమస్యలు ఎదుర్కొంటోంది. నోకియా టెక్నాలజీపై గతంలో భారీగా వెచ్చించిన కొన్ని బడా దేశీ కంపెనీలు ప్రస్తుతం దీనిపై మునుపటిలా ఖర్చు చేసేందుకు మొగ్గ చూపకపోవడంతో భారత్ మార్కెట్‌లో నోకియా నెగ్గుకురాగలగడం సంక్లిష్టంగా మారింది.దీంతో నోకియా తన మనీ, టెక్నాలజీ, లీగల్ స్టఫ్ ఇన్‌ఛార్జ్‌ల వంటి పలు కీలక పొజిషన్స్‌ను వదిలించుకోవాలని చూస్తోంది.

ఇక నోకియా తన కార్యకలాపాలను మొ బైల్ నెట్‌వర్క్స్, క్లౌడ్, నెట్‌వర్క్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి మూడు విభాగాలుగా విబజించనుంది. ప్రతి విభాగం భారత్‌లో నోకియా వ్యాపారాల్లో వివిధ విభాగాలపై దృష్టి సారిస్తాయి.

## ఐదు నిమిషాలకొక క్రెటా దేశవ్యాప్తంగా స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాలకు డిమాండ్




**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాలకు డిమాండ్ అంతకంతకు పెరుగుతున్నది. లగ్జరీ లుకింగ్, సౌకర్యవంతంగా ఉండటంతో ఎగబడి కొనుగోళ్లు జరుపుతున్నారు కస్టమర్లు. ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ హ్యుందాయ్.. ఎనిమిదేండ్ల క్రితం దేశీయ మార్కెట్లోకి విడుదల చేసిన క్రెటాను ఎగబడి కొనుగోళ్లు జరుపుతున్నారు. 2015 నుంచి ఇప్పటి వరకు 10 లక్షల యూనిట్ల వాహనాలను విక్రయించింది. అంటే ఐదు నిమిషాలకొక క్రెటాను విక్రయించినట్లు అయింది.ఇటీవల సంస్థ అప్‌డేటెడ వెర్షన్ క్రెటాను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కారుకోసం కూడా కస్టమర్లు క్యూకట్టారు. ఇప్పటి వరకు ఏకంగా 60 వేలకు పైగా బుకింగ్‌లు వచ్చాయి. రూ.11 లక్షల ప్రారంభ ధరతో ఏడు రకాల్లో ఈ మాడల్‌ను మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకొచ్చింది సంస్థ.కొత్త క్రెటా కారు కావాలంటే గరిష్ఠంగా ఏడు నెలలు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. అలాగే క్రెటాను ఇప్పటి వరకు 2.80 లక్షల యూనిట్లను ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేసింది. కియా సెల్టోస్, మారుతి గ్రాండ్ విటారా, టాటా హారియర్, మహీంద్రా స్కార్పియో-ఎన్, టయోటా అర్బన్ క్రూజర్, స్కోడా కుష్‌క్యూ, ఫోక్స్‌వ్యాగన్ టైగూన్‌ల నుంచి క్రెటా తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నది.

## కాంగ్రెస్ ఖాతా నుంచి రూ. 65 కోట్ల బకాయిల రికవరీ



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ ఖాతా నుంచి ఆదాయ పన్ను శాఖ రూ. 65 కోట్ల బకాయిలను రికవరీ చేసింది. ఆదాయ పన్ను శాఖకు కాంగ్రెస్ రూ. 115 కోట్ల పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉం డగా ఐటీ శాఖ రూ. 65 కోట్లు రికవరీ చేసింది. కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ ఖాతా నుంచి ఈ నిధులను ఐటీ శాఖ రికవరీ చేసింది.రూ. 65 కోట్ల రికవరీని సవాల్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఇన్‌కం ట్యాక్స్ అప్పీలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి రికవరీకి వ్యతిరేకంగా ఫిర్యా దు చేసింది. బెంచ్ ముందుకు విచారణ ఫలితం కోసం వేచిచూడకుండానే బ్యాంకుల వద్ద కాంగ్రెస్ ఖాతాల్లో ఉన్న డబ్బులో కొంత ఐటీ శాఖ బకాయిల కింద రికవరీ చేసిం దని ఫిర్యాదులో పేర్కొంది.కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన స్టే దరఖాస్తు వ్యవహారం తేలేవరకూ ఆదాయ పన్ను శాఖ చర్యలను నిలువరించాలని కోరింది. ఈ వ్యవహారంపై త దుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకూ యథాతథ స్థితి కొనసాగుతుందని ట్రిబ్యునల్ ఆదేశించింది.

## సరిహద్దుల్లో రైతులు ఎవరూ చనిపోలేదు : హర్యానా పోలీసులు



**న్యూఢిల్లీ :** ఢిల్లీ సరిహద్దుల్లో చోటు చేసుకున్న ఉద్రిక్తల్లో ఇద్దరు రైతులు ప్రా ణాలు కోల్పోయినట్లుగా వచ్చిన వార్త లపై హర్యానా పోలీసులు తాజాగా స్పందించారు. ఈరోజు సరిహద్దుల్లో జరిగిన ఉద్రిక్తల్లో రైతులు ఎవరూ చని పోలేదని వెల్లడించారు. 'ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం.. సరిహద్దు వద్ద ఈరోజు రైతులు ఎవరూ చనిపోలేదు. ఇది కేవలం పుకారు మాత్రమే. డేటా సింగ్-ఖనోరీ సరిహద్దు ఇద్దరు పోలీసులు, ఒక నిరసనకారుడు గాయపడినట్లు సమాచారం ఉంది' అని హర్యానా పోలీసులు స్పష్టం చేశారు.ఛలో ఢిల్లీ పేరిట రైతులు చేపట్టిన నిరసన ఉద్రిక్తతలకు దారి తీసింది.

# రచిన్ దంచెన్.. డెవాన్ రాణించెన్.. తమిళ తంబీలు హ్యాపీ




ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024 సీజన్ ఆరంభానికి సమాయత్తమవుతున్న వేళ డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్. ఈ సీజన్‌లో సీఎస్కే తరఫున ఆడనున్న న్యూజిలాండ్ స్పిన్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర.. స్వదేశంలో ఆస్ట్రేలియాతో నేటి నుంచి మొదలైన టీ20 సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో దంచికొట్టాడు. 35 బంతుల్లోనే 2 బౌండరీలు, 6 భారీ సిక్సర్ల సాయంతో 68 పరుగులు చేశాడు. అతడికి తోడు సీఎస్కే ఓపెనర్ అయిన డెవాన్ కాన్వే.. 46 బంతుల్లో 5 బౌండరీలు, 2 సిక్సర్ల సాయంతో 63 రన్స్ చేశాడు. ఈ ఇద్దరి బాదుడుత తొలి మ్యాచ్‌లో కివీస్.. నిర్ణీత 20 ఓవర్లలో 215 పరుగుల భారీ స్కోరుచేసింది.గతేడాది భారత్ వేదికగా ముగిసిన వన్డే ప్రపంచకప్‌లో 10 మ్యాచ్‌లు ఆడి ఏకంగా 578 పరుగులు చేసిన రచిన్ రవీంద్ర.. మూడు సెంచరీలు బాదాడు. వరల్డ్ కప్ సింగిల్ ఎడిషన్‌లో అత్యధిక పరుగులు చేసిన అర ంగేట్ర ఆటగాడిగా నిలిచాడు. దీంతో ఐపీఎల్‌లో అతడిని తమ సొంతం చేసుకునేందుకు ఫ్రాంచైజీలు ఆసక్తిగా ఎదురుచూశాయి. చెన్నై సూపర్ కింగ్స్ అతడిని రూ. 1.8 కోట్లతో దక్కి ంచుకుంది.కివీస్‌తో తొలి మ్యాచ్‌లో కాన్వే, రచిన్‌లు రెండో వికెట్‌కు 113 పరుగులు జోడిం చారు. మిచెల్ స్టార్క్, జోష్ హెజిల్‌వుడ్, పాట్ కమిన్స్ పేస్ త్రయంతో పాటు స్పిన్నర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్, ఆడమ్ జంపా బౌలింగ్‌లో ఈ ద్వయం భారీగా పరుగులు రాబట్టింది. కాన్వే కాస్త నెమ్మదిగానే ఆడగా రచిన్ కూడా అతడు ఎదుర్కొన్న తొలి 16 బంతుల్లో 14 రన్స్ మాత్రమే చేశాడు. కానీ ఆ తర్వాత 19 బంతుల్లో ఏకంగా 54 పరుగులు సాధించాడు. ఐపీఎల్ ఆరంభానికి ముందు ఈ ఇద్దరూ చెన్నై ఆటగాళ్లు దంచికొట్టడంతో తమిళ తంబీలు ఫుల్ జోష్‌లో ఉన్నారు.

# భారత్ హాయిగా నిద్రపోతుంది.. విరుష్క జంటకు వినూత్నంగా

## శుభాకాంక్షలు తెలిపిన ఆర్సీబీ



టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ రెండోసారి తండ్రైన విషయం తెలిసిందే. అనుష్క శర్మ ఈ నెల 15వ తేదీన పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని విరుష్క జంట సామాజిక మాధ్యమాల ద్వారా మంగళవారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ జంటకు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. పలువురు క్రీడాకారులు, సినీ ప్రముఖులు, అభిమానులు కోహ్లీ, అనుష్క జంటకు కంగ్రాట్స్ చెబుతూ పోస్టులు పెడుతున్నారు. ఈ క్రమంలోనే కోహ్లీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఐపీఎల్ ఫ్రాంఛైజీ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తనదైన శైలిలో శుభాకాంక్షలు తెలిపింది.ఇది చాలా సంతోషకరమైన వార్త అని, భారతదేశం మొత్తం ఈరోజు హాయిగా నిద్రపోతుంది అని పేర్కొంది. 'ఇప్పుడు నలుగురు సభ్యులు. విరాట్, అనుష్కలకు శుభాకాంక్షలు. ఆర్సీబీ కుటుంబంలోని అతి పిన్న వయస్కుడైన అకాయ్‌ను సాదరంగా ఆహ్వానిస్తున్నాం. ఇది చాలా సంతోషకరమైన వార్త. భారతదేశం మొత్తం ఈ రాత్రి హాయిగా నిద్రపోతుంది' అంటూ ఆర్సీబీ ఎక్స్‌లో పేర్కొంది. ఈ ట్వీట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.విరాట్ కోహ్లీ అనుష్క జంట 2017 డిసెంబర్ 11న ఇటలీలో ప్రేమ వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ జంటకు 2021లో ఓ పాప వామిక జన్మించింది. ఇప్పుడు బాబు పుట్టాడు. ఆ బాబుకు అకాయ్ అని నామకరణం కూడా చేశారు. ప్రస్తుతం భారత్, ఇంగ్లండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ జరుగుతుండగా.. ఈ కారణంగానే కోహ్లీ జట్టుకు దూరమైన విషయం తెలిసిందే.

# ఉగ్రవాది పన్నున్ బెదిరింపు.. ఇంగ్లండ్-ఇండియా టెస్టుకు భద్రత పెంపు




**రాంచీ:** అమెరికా ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నున్ వార్నింగ్ నేపథ్యంలో ఇంగ్లండ్, ఇండియా మధ్య రాంచీలో జరగనున్న నాలుగో టెస్టు మ్యాచ్‌కు భారీ భద్రతను పెంచారు. రాంచీ టెస్టును చెదరగొట్టేందుకు ఆ ఉగ్రవాది ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రాంచీలో భారీ సంఖ్యలో భద్రతను పెంచారు. పన్నున్‌ను ఉగ్రవాదిగా ప్రకటిస్తూ ఇటీవల కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇంగ్లండ్, భారత్ మధ్య జరిగే టెస్టు మ్యాచ్‌ను అడ్డుకోవాలని అతను సోషల్ మీడియాలో ఓ వీడియోలో అప్‌లోడ్ చేశాడు. మ్యాచ్‌ను అడ్డుకోవాలంటూ ఆయన సీపీఐ దళాన్ని కోరారు. ఈనెల 23వ తేదీ నుంచి నాలుగో టెస్టు మ్యాచ్ జేఎస్సీఏ ఇంటర్నేషనల్ స్టేడియం కాంప్లెక్స్‌లో జరగనున్నది. మంగళవారమే ఇంగ్లండ్ జట్టు రాంచీ చేరుకున్నది.ఉగ్రవాది పన్నున్‌పై దుర్వా పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఐటీ చట్టం ప్రకారం ఆ ఫిర్యాదు నమోదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు ప్రారంభించినట్లు హతియా డీఎస్పీ పీకే మిశ్రా తెలిపారు. ఉగ్రవాది పన్నున్‌పై నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ 2019 నుంచి నిఘా పెట్టింది. అమెరికాలో ఉంటూ పంజాబ్‌లో బీభత్సం సృష్టిస్తున్నట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి.పన్నున్‌కు నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేశారు. 2021, ఫిబ్రవరి 3వ తేదీన ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఆ వారెంట్ ఇచ్చింది. గత ఏడాది నవంబర్ 29వ తేదీన అతన్ని నేరస్థుడిగా కూడా ప్రకటించారు.

# అకాయ్ అర్థం ఏంటి..

## ఆ పేరెందుకు పెట్టారు ?



**న్యూఢిల్లీ:** విరాట్ కోహ్లీ అనుష్కా దంపతులకు కొడుకు పుట్టాడు. అతనికి అకాయ్ అని నామకరణం చేశారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో కోహ్లీ వెల్లడించాడు. ఈ నెల 15వ తేదీన అనుష్కా మగబిడ్డకు జన్మనిచ్చినట్లు చెప్పాడు. 2021లో ఆ జంటకు ఓ అమ్మాయి పుట్టిన విషయం తెలిసిందే. ఆ పాప పేరు వామిక. బాబుకు అకాయ్ అని పేరు పెట్టడం వెనుక ఉన్న అర్థం ఏంటో తెలుసుకుందాం.అకాయ్ అని పేరు పెట్టడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటో తెలియదు. కానీ పేరు మాత్రం చాలా ప్రత్యేకంగా ఉన్నది. చాలా విశిష్టంగా వినిపిస్తున్న ఆ పేరు గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం. హిందీ పదం కాయ అన్న పదం నుంచి అకాయ్ వచ్చినట్లు భావిస్తున్నారు. కాయ్ అంటే కాయం. అంటే శరీరం అని అర్థం. అకాయ్ అంటే పుష్టికరమైన శరీరం కలవాడని అర్థం వస్తుందని కొందరు భాషా నిపుణులు భావిస్తున్నారు. ఇక టర్కిష్ భాషలో అకాయ్ పదానికి ఓ అర్థం ఉన్నది. మెరిసే చంద్రుడిని అకాయ్ అని ఆ భాషలో పిలుస్తారు.మగబిడ్డకు అకాయ్ అనే పేరును ఎందుకు పెట్టారో ఇంకా విరుష్కా జోడి అధికారికంగా చెప్పలేదు.

కానీ ఇప్పటికే ఆకాయ్ పేరు సోషల్ మీడియాలో పాపులర్ అయిపోయింది. కొన్ని గంటల్లోనే విరాట్ కోహ్లీ చేసిన పోస్టుకు 50 లక్షల లైక్‌లు వచ్చేశాయి. బాబుకు జన్మనిచ్చిన విరుష్కా జోడికి క్రికెట్, ఫిల్మ్ రంగాల నుంచి విషెస్ అందుతున్నాయి.

# బాబర్ మరో అరుదైన ఘనత..

## గేల్, కోహ్లీ రికార్డులు బ్రేక్.. ఆ జాబితాలో రెండో క్రికెటర్..

పాకిస్తాన్ మాజీ సారథి, ప్రస్తుతం పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో పెషావర్ జల్మీ తరఫున కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న బాబర్ ఆజమ్ మరో అరుదైన ఘనతను అందుకున్నాడు. టీ20 క్రికెట్‌లో ఈ బ్యాటర్ పది వేల పరుగులు పూర్తిచేసుకున్నాడు. పెషావర్ జల్మీ.. కరాచీ కింగ్స్ మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో భాగంగా బాబర్ ఈ ఘనత అందుకున్నాడు. అంతర్జాతీయంగా పొట్టి క్రికెట్‌లో ఈ రికార్డు అందుకున్న 13వ బ్యాటర్ కాగా పాకిస్తాన్ నుంచి మాత్రం టీ 20 క్రికెట్‌లో పదివేల పరుగులు పూర్తిచేసిన రెండో క్రికెటర్‌గా నిలిచాడు.కరాచీ కింగ్స్‌తో గడాఫీ స్టేడియం (లాహోర్) వేదికగా జరుగుతున్న మ్యాచ్‌కు ముందు బాబర్.. 9,994 పరుగులుతో ఉన్నాడు. కానీ కరాచీతో మ్యాచ్‌లో బాబర్.. 51 బంతుల్లోనే 7 బౌండరీలు, 1 సిక్సర్ సాయంతో 72 పరుగులు చేశాడు. అతడు వ్యక్తిగత స్కోరు 6 పరుగులు దాటగానే పదివేల పరుగుల మైలురాయిని దాటాడు. పదివేల పరుగుల మైలురాయికి చేరుకోగానే బాబర్..

క్రిస్‌గేల్, కోహ్లీ, వార్నర్ వంటి దిగ్గజాల రికార్డును బ్రేక్ చేశాడు. టీ20 (అంతర్జాతీయ మ్యాచ్‌లతో పాటు లీగ్‌లు) క్రికెట్‌లో గేల్.. 285 ఇన్నింగ్స్‌లలో ఈ ఘనత సాధించగా తాజాగా బాబర్.. 271 ఇన్నింగ్స్‌లలోనే ఈ మైలురాయిని అందుకోవడం విశేషం. కోహ్లీ (299), వార్నర్ (303), ఫించ్ (327), జోస్ బట్లర్ (350)లు తదుపరి స్థానాల్లో నిలిచారు.అంతర్జాతీయంగా ఈ రికార్డు అందుకున్న 13వ బ్యా ట ర్‌గా బాబర్ నిలవగా పాకిస్తాన్ నుంచి మాత్రం ఈ ఘనత సాధించిన రెండో బ్యాటర్ అతడే. గ తంలో ఈ రికార్డు వెటరన్ ఆటగాడు షోయబ్ మాలిక్ పేరిట ఉంది. 42 ఏండ్ల మాలిక్.. 20 05 నుంచి నేటి వరకూ 494 ఇన్నింగ్స్‌లలో 13,159




రన్స్ చేశాడు. బాబర్ కంటే ముందు పది వేల పరుగుల క్లబ్‌లో ఉన్న ఆటగాళ్లలో గేల్, మాలిక్, పొలార్డ్, అలెక్స్ హేల్స్, డేవిడ్ వార్నర్, విరాట్ కోహ్లీ, ఆరోన్ ఫించ్, రోహిత్ శర్మ, జోస్ బట్లర్, కొలిన్ మున్రో, విన్స్, డేవిడ్ మిల్లర్‌లు ఉన్నారు.

# 'సచిన్ సచిన్'.. ఆటకు దూరమై పదేండ్లు దాటినా ఆ పేరులో పవర్ తగ్గలె..

'సచిన్ సచిన్..' మూడు దశాబ్దాలుగా మాస్టర్ బ్లాస్టర్ క్రీజులోకి వచ్చినప్పుడల్లా స్టేడియం స్టేడియం మొత్తం ఏదో కరెంట్ షాక్ కొట్టినట్టు ఊగిపోయేది. భారత్‌లో క్రికెట్ ఓ మతం అయితే భక్తులు (అభిమానులు) సచిన్‌ను దేవుడిగా ఆరాదించారు. క్రికెట్‌లో మరెవరికీ సాధ్యం కాని విధంగా తన పేరిట రికార్డులు లిఖించుకున్న ఈ దిగ్గజం అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పి పదేండ్లు దాటిపోయింది. అయితే ఆటకు రిటైర్మెంట్ చెప్పి పదేండ్లు దాటినా సచిన్ ఎక్కడికెళ్లినా అతడి అభిమానగణం మాత్రం ఆ మంత్రాన్ని (సచిన్ సచిన్) నిత్యం జపిస్తూనే ఉన్నారు. తాజాగా టెండూల్కర్ ముంబైకి రావడానికి విమానం ఎక్కగానే అక్కడున్న ప్యాసెంజర్లంతా ఒక్కసారిగా 'సచిన్.. సచిన్' అంటూ ఆయన జపం చేశారు.ఇటీవలే ఆగ్రాను దర్శించిన మాస్టర్ బ్లాస్టర్.. భార్య అంజలితో కలిసి జమ్మూకాశ్మీర్ వెకేషన్ వెళ్లాడు. అక్కడ్నుంచి ముంబైకి తిరుగు ప్ర యాణమైన సచిన్.. విమానంలోకి రాగానే లోపల ఉన్న ప్యాసెంజర్లంతా అతడిని చూసి కొంతసేపు సచిన్ నామస్మరణ చేశారు. వాళ్ల అభిమానాన్ని చూసిన సచిన్.. లేచి అందరి వైపు చూస్తే రెండు చేతులు జోడించి 'థ్యాంక్యూ.. థ్యాంక్యూ..' అంటూవారికి కృతజ్ఞతలు తెలిపాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.1989లో భారత క్రికెట్‌లోకి వచ్చిన సచిన్.. అంతర్జాతీయ స్థాయిలో 34వేలకు పైగా పరుగులు చేశాడు. ఇందులో వంద సెంచరీలున్నాయి. టెస్టులలో మరే ఆటగాడు చేరుకోని విధంగా 200 టెస్టులు ఆడి 15,921 రన్స్ సాధించాడు. సచిన్ తన ఆఖరి టెస్టును అతడికి ఎంతో ఇష్టమైన ముంబైలోని వాంఖడే స్టేడి



యంలో ఆడాడు. 2013 నవంబర్ 16న సచిన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు ప్రకటించాడు.

# మార్ష్, డేవిడ్ వీరవిహారం..

## భారీ టార్గెట్‌ను ఊదేసిన ఆసీస్

న్యూజిలాండ్ పర్యటనను ఆసీస్ భారీ విజయంతో ఆరంభించింది. వెల్లింగ్టన్ వేదికగా ముగిసిన తొలి టీ20లో మిచెల్ మార్ష్ సారథ్యంలోని కంగారూలు.. కివీస్ నిర్దేశించిన 216 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆఖరి బంతికి ఛేదించారు. ఆ జట్టు సారథి మిచెల్ మార్ష్ కెప్టెన్సీ ఇన్నింగ్స్ (44 బంతుల్లో 72 నాటౌట్, 2 ఫోర్లు, 7 సిక్సర్లు) ఆడగా మిడిలార్డర్ బ్యాటర్ టిమ్ డేవిడ్.. పది బంతుల్లోనే రెండు ఫోర్లు, మూడు భారీ సిక్సర్ల సాయంతో 31 పరుగులతో రాణించడంతో ఆ జట్టు ఆరు వికెట్ల తేడాతో తొలి టీ20లో ఘనవిజయాన్ని అందుకుంది.వెల్లింగ్టన్‌లోని స్కై స్టేడియంలో జరిగిన తొలి టీ20లో మొదట బ్యాటింగ్ చేసిన కివీస్.. నిర్ణీత 20 ఓవర్లలో 36 వికెట్లు మాత్రమే కోల్పోయి 215 పరుగులు చేసింది. రచిన్ రవీంద్ర (35 బంతుల్లో 68, 2 ఫోర్లు, 6 సిక్సర్లు), డెవాన్ కాన్వే (46 బంతుల్లో 63, 5 ఫో ర్లు, 2 సిక్సర్లు), ఫిన్ అలెన్ (17 బంతుల్లో 32, 2 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించడంతో ఆ జట్టు ఆసీస్ ముందు భారీ



టార్గెట్ ఉంచింది.లక్ష్య ఛేదనలో ఆసీస్ కూడా దూకుడుగానే ఆడింది. ఓపెనర్ డేవిడ్ వార్నర్ (20 బంతుల్లో 32, 1 ఫోర్, 3 సిక్సర్లు), ట్రావిస్ హెడ్ (15 బంతుల్లో 24, 3 ఫోర్లు, 1 సి క్స్) ఉన్నంతసేపు మెరుపులు మెరిపించారు. వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ మిచెల్ మార్ష్.. మ్యాక్స్‌వెల్ (11 బంతుల్లో 25, 2 ఫోర్లు, 2 సిక్సర్లు), జోష్ ఇంగ్లిస్ (20) అండతో ఆసీస్‌ను విజ యం దిశగా తీసుకెళ్లాడు. ఛేదనలో 16 ఓవర్లు ముగిసేటప్పటికీ ఆసీస్.. 3 వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసింది. 26 బంతుల్లో 46 పరుగులు చేయాల్సి ఉన్న క్రమంలో శాంట్నర్ వేసిన 17వ ఓవర్లో 3 పరుగులే ఇచ్చి ఇంగ్లిస్‌ను ఔట్ చేశాడు. ఫెర్గూసన్ వేసిన 18వ ఓవర్లో కూడా 8 పరుగులే వచ్చాయి.కానీ ఆడమ్ మిల్నే వేసిన 19వ ఓవర్లో డేవిడ్ వీరవిహారం చేశాడు. ఈ ఓవర్లో తొలి మూడు బంతుల్లో మూడు పరుగులే రాగా ఆఖరి మూడు బంతుల్లో 4, 6, 6తో 19 రన్స్ రాబట్టాడు. ఆఖరి ఓవర్లో 16 రన్స్ అవసరం కాగా రెండు బంతుల్లో టిమ్ సౌథీ మూడు పరుగులే ఇచ్చాడు. చివరి నాలుగు బంతుల్లో డేవిడ్.. 4, 6, 2. 4 బాది కంగారూలను విజయం వైపు నిలిపాడు. ఈ మ్యాచ్‌లో కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన మార్ష్‌కే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

# వరుసగా డబుల్ సెంచరీలు..

## ఐసీసీ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌కు జైస్వాల్

స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా ఇప్పటికే రెండు ద్విశతకాలు సాధించిన టీమిండియా యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్.. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ ర్యాంకుకు చేరుకున్నాడు. హైదరాబాద్ టెస్టులో 80లలోకి వచ్చి సెంచరీ మిస్ చేసుకున్న యశస్వీ.. వైజాగ్, రాజ్‌కోట్‌లలో మాత్రం వరుసగా రెండు డబుల్ సెంచరీలు కొట్టాడు. తద్వారా అతడు ఐసీసీ టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో 14వ స్థానాలు పైకి ఎగబాకిన అతడు.. 15వ ర్యాంకుకు చేరుకున్నాడు.రాజ్‌కోట్ టెస్టుకు ముందు 29వ ర్యాంకులో ఉన్న జైస్వాల్.. తాజాగా 15వ స్థానానికి ఎగబాకాడు. జైస్వాల్ 699 పాయింట్లతో ఈ ర్యాంకుకు చేరాడు. కాగా ఐసీసీ టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి విరాట్ కోహ్లీ ఒక్కడే టాప్ -10లో ఉన్నాడు. కోహ్లీ.. 752 పాయింట్లతో ఏడో స్థానంలో ఉన్నాడు. టీమిండియా సారథి రోహిత్ శర్మ ఒక స్థానం ఎగబాకి 12వ ర్యాంకుకు చేరాడు. రాజ్‌కోట్ టెస్టులో 88 బంతుల్లోనే సెంచరీ చేసిన ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్.. 12 స్థానాలు ఎగబాకి 13వ ర్యాంకుకు చేరాడు. రాజ్‌కోట్‌లో సెంచరీ చేసిన రవీంద్ర జడేజా.. 7 స్థానాలు మెరుగుపరుచుకుని 34వ ర్యాంకుకు చేరుకున్నాడు. ఈ జాబితాలో కేన్ విలియమ్సన్ అగ్రస్థానంలో ఉన్నాడు.టెస్టు బౌలర్ల జాబితాలో టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా.. అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా రాజ్‌కోట్ టెస్టులో 500వ వికెట్ చేరాడు.



# విడుదలకు ముందే భారీ ధరకు 'టిల్లు స్క్వేర్' ఓటీటీ రైట్స్



'డీజే టిల్లు' సినిమాతో స్టార్ హీరోగా మారిపోయాడు యంగ్ హీరో సిద్ధు జొన్నలగడ్డ ఈ సినిమా ఇచ్చిన జోష్‌తో ప్రస్తుతం సీక్వెల్‌లో నటిస్తున్నాడు. 'టిల్లు స్క్వేర్' వస్తున్న ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్ కథనాయికగా నటిస్తుండగా.. మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం మార్చి 29న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. ఇప్పటికే సినిమా నుంచి ట్రైలర్ విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా విడుదల కాకముందే ఓటీటీ రైట్స్‌కు సంబంధించి ఒక న్యూస్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఈ సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ భారీ రేటుకు దక్కించుకుందట. ఇన్‌సైడ్ టాక్ ప్రకారం ఈ సినిమా హక్కులు రూ. 35 కోట్లకు అమ్ముడయ్యాయట. నిజానికి ఇది చాలా పెద్ద నెంబరే. ఇటీవల కాలంలో ఒక యువ కథానాయకుడి సినిమాకు ఈ రేంజ్‌లో ధర పలకడం అంటే విశేషమనే చెప్పాలి. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్య దేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమాకు రామ్ మిర్యాల సంగీతం అందిస్తుండగా.. తమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోరు ఇచ్చారు.



# దుల్కర్ సల్మాన్‌ను డైరెక్ట్ చేయబోతున్న దళపతి విజయ్ కొడుకు.?

కోలీవుడ్ స్టార్ హీరో దలపతి విజయ్ కొడుకు జేసన్ సంజయ్ దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. తమిళంలో అగ్ర నిర్మాణ సంస్థలలో ఒకటైన లైకా ప్రొడక్షన్ బ్యానర్‌లో జేసన్ సంజయ్ తన మొదటి సినిమాకు సైన్ చేశాడు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ ప్రాజెక్ట్ త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది. ఈ క్రమంలోనే ప్రాజెక్ట్‌కు సంబంధించి ఓ సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ సినిమాలో హీరోగా మలయాళ హీరో దుల్కర్ సల్మాన్‌ను నటించనున్నట్లు తెలుస్తుంది. దీనికి సంబంధించి ఇప్పటికే దుల్కర్ ప్రీ ప్రొడక్షన్ లలో కూడా పాల్గొనన్నాడని సమాచారం. ఇక ఇదే నిజమైతే మాత్రం దళపతి విజయ్ కొడుకుకి బెస్ట్ హీరో దొరికేసినట్లే. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. దలపతి విజయ్‌కు ఇద్దరు పిల్లలు. కొడుకు జోసెఫ్ సంజయ్, కూతురు దివ్య శశి ఉన్నారు. ఇక సంజయ్ గతంలో ఉప్పెన సినిమాతో తమిళంలో హీరో ఎంట్రీ ఇస్తున్నాడని, విజయ్ సేతుపతి నిర్మాతగా ఉంటాడని పలు వార్తలు వచ్చాయి. దీంతో పాటుగా ప్రేమమ్ సినిమా దర్శకుడు ఆల్ఫోన్స్ పుత్రేన్ కూడా జేసన్ సంజయ్‌కు ఒక కథ చెప్పారట. అయితే సంజయ్ మాత్రం నటుడిగా కాకుండా దర్శకుడిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వాలని అనుకుంటున్నాడు. అంతేకాకుండా సంజయ్ లండన్‌లో డైరెక్షన్‌కు సంబంధించిన కోర్స్ కూడా చేశాడు. ఇక షారుఖ్ కొడుకు కూడా దర్శకుడిగానే ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తున్నాడు.



# తండ్రి అయిన టాలీవుడ్ హీరో నిఖిల్..

## ఫొటో వైరల్

టాలీవుడ్ హీరో నిఖిల్ సిద్దార్థ అభిమానులకు గుడ్ న్యూస్. నిఖిల్ తండ్రి అయ్యాడు. ఆయన భార్య పల్లవి ఈరోజు ఉదయం పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. నిఖిల్ తన కుమారుడిని ఎత్తుకుని.. ముద్దాడుతున్న ఫొటో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు నిఖిల్– పల్లవి




దంపతులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

ఇక నిఖిల్ తండ్రి అయిన సందర్భంగా అనే హాష్‌ట్యాగ్ ప్రస్తుతం ట్రెండ్ అవుతుంది. 2020లో డాక్టర్ పల్లవిని నిఖిల్ ప్రేమ వివాహం చేసుకున్నాడు. 2020 కోవిడ్ టైంలో వీరి పెళ్లి కాగా.. కరోనా నిబంధనలను పాటిస్తూ పెళ్లి చేసుకున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే..

నిఖిల్ ప్రస్తుతం 'కార్తికేయ 2' సినిమా ఇచ్చిన జోష్‌తో మరో పాన్ ఇండియా చిత్రం స్వ యంభు చేస్తున్నాడు. ఈ సినిమాకు భరత్ కృష్ణమాచారి దర్శ కత్వం వహిస్తుండగా.. మలయాళ భామ సంయుక్తామీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇక హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో రానున్న ఈ సినిమాలో నిఖిల్? ఓ యోధుడి? పాత్రలో కనిపించనున్నారు.

# వాయిస్ రీక్రియేట్.. 'కీడా కోలా' టీమ్‌కి రూ.కోటి నష్టపరిహారం.!




టాలీవుడ్ లెజెండరీ సింగర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం కొడుకు ఎస్పీ చరణ్ తరుణ్ భాస్కర్ సినిమా కీడా కోలా టీమ్‌కు లీగల్ నోటీసులు పంపిన విషయం తెలిసిందే. తన తండ్రి (ఎస్పీ బాలసుబ్రమణ్యం) వాయిస్‌ను ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాయంతో రీ క్రియేట్ చేసి కీడా కోలా సినిమాలో వాడుకున్నందుకు 'కీడా కోలా' చిత్ర నిర్మాతతో పాటు సంగీత దర్శకుడు వివేక్ సాగర్‌లకు ఎస్పీ చరణ్ నోటీసులు పంపారు. అయితే తాజాగా నష్టపరిహారం విషయమై అల్టిమేటమ్ ఇచ్చినట్లు తెలుస్తుంది.

ఈ వివాదంపై ఎస్పీ చరణ్ తరఫు లాయర్ స్పందిస్తూ.. అనుమతి లేకుండా లెజెండరీ సింగర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం వాయిస్‌ను వాడుకున్నందుకు గాను కీడా కోలా టీమ్ క్షమాపణ చెప్పడంతో పాటు రూ.కోటి నష్టపరిహారం, రాయల్టీలో షేర్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో ఈ వివాదం రోజు రోజుకు ముదురుతున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై దర్శకుడు తరుణ్ భాస్కర్ స్పందించాల్సి ఉం ది .ఇంతకి ఏం జరిగింది? పెళ్లి చూపులు (ఫేమ్ తరుణ్ భాస్కర్ స్వీయ దర్శకత్వంతో వచ్చిన చిత్రం 'కీడా కోలా' బ్రహ్మానందం, చైతన్య రావు, రాగ్ మయూర్ ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటించారు. సరికొత్త క్రైమ్ కామెడీ కథాంశంతో తెరకెక్కిన ఈ మూవీ దగ్గుబాటి రానా సమర్పణలో నవంబర్ 03న ప్రేక్షకుల ముందుకు అందుకుంది.

# హీరోయిన్ త్రిషకు క్షమాపణలు చెప్పిన


## అన్నాడీఎంకే మాజీ నేత ఏవీ రాజు..!



హీరోయిన్ త్రిష కృష్ణన్‌కు అన్నాడీఎంకే మాజీ నేత ఏవీ రాజు క్షమాపణలు తెలిపారు. ఇటీవల ఆయన త్రిషపై అభ్యంతర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఆయన వ్యాఖ్యలపై సినీ, రాజకీయ నాయకులతో పలువురు ప్రముఖులు మండిపడ్డారు. ఈ క్రమంలో ఆయన క్షమాపణలు చెబుతూ.. తన ప్రకటనను తప్పుగా అర్థం చేసుకున్నారన్నారు. నటిపై అలాంటి వ్యాఖ్యలు చేయడం తన ఉద్దేశం కాదన్నారు. అలాగే, దర్శకుడు చరణ్, నటుడు కరుణాదాస్‌తో పలువురికి క్షమాపణలు చెబుతున్నానని.. ఎవరి మనోభావాలు దెబ్బతిన్నట్లయితే క్షమించాలని కోరారు. అన్నాడీఎంకే తమిళనాడు ఏఐఏడీఎంకే నేత ఏవీ రాజుకీ, అన్నాడీఎంకే పార్టీ ఎమ్మెల్యే జీ వెంకటాచలానికి మధ్య వివాదం కొనసాగుతున్నది. ఈ క్రమంలో ఏవీ రాజు.. వెంక టాచలాన్ని ఉద్దేశించి విమర్శలు చేస్తూ మధ్యలో హీరోయిన్ త్రిష కృష్ణన్ పేరును ప్రస్తావించాడు. అంతటితో ఆగకుండా ఆమె వ్యక్తిగత జీవితంపై సంచలన కామెంట్స్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైర్ అయ్యింది. దీనిపై త్రిష సైతం మండిపడింది. ప్రజల దృష్టిని ఆకర్షించడానికి ఏ స్థాయికైనా దిగజారగల ఇలాంటి నీచమైన మనుషులను మళ్లీ మళ్లీ చూడడం మరింత ఘోరంగా ఉందం టూ సోషల్ మీడియా వేదికగా స్పందించింది. తన ఓపిక నశిం చిందని.. ఇక అలాంటి వ్యక్తులను క్షమించనని.. వ్యక్తిత్వాన్ని కించ పరిచేలా ఎవరు మాట్లాడినా లీగల్ డిపార్ట్‌మెంట్ నుంచే సమాధానం వస్తుందంటూ హెచ్చరించింది. ఏవీ రాజు వ్యాఖ్యలపై పలువురు సినీ తారలు మండిపడ్డారు. హీరో విశాల్ సైతం రాజకీయ నేత వ్యాఖ్యలను ఖండించారు. ఇక త్రిష సినిమాల విషయానికి వస్తే చివరిసారిగా 'లియో' చిత్రంలో కనిపించింది. ప్రస్తుతం ఐదు సినిమాల్లో నటిస్తున్నది. విదా ముయార్చి చిత్రంలో అజిత్‌తో జతక ట్టబోతున్నది. మోహన్‌లాల్ లీడ్‌లో తెరకెక్కనున్న రామ్, ఐడెంటిటీ, థగ్ లైఫ్ చిత్రాలతో పాటు మెగాస్టార్ హీరోగా తెరకెక్కుతున్న విశ్వంభర చిత్రం లోనూ కనిపించబోతున్నది. దాదాపు 18 సంవత్సరాల తర్వాత చిరుతో జంటగా నటిస్తున్నది.

# హైదరాబాద్ 'ప్రేమలు'..

## మలయాళంలో బ్లాక్ బస్టర్



మలయాళంలో చిన్న సినిమాగా విడుదలై బ్లాక్ బస్టర్ అయిన తాజా చిత్రం 'ప్రేమలు'. రూ.11 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఫిబ్రవరి 09న విడుదలై కేవలం 12 రోజుల్లోనే రూ.50 కోట్ల వసూళ్లను సాధించింది. తెలంగాణ హైదరాబాద్ బ్యాక్ డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం ప్రస్తుత యూత్‌ను తెగ ఆకట్టుకుంటుంది. ప్రముఖ మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్ నిర్మించిన ఈ సినిమాను గిరీష్ ఏడీదర్శకత్వం దర్శకత్వం వహించగా.. నస్లేన్, మమితా, అల్తాఫ్ సలీమ్, మీనాక్షి రవీంద్రన్, అఖిల భార్గవన్ ప్రధాన పాత్రలు పోషించారు. అయితే ఈ సినిమా షూటింగ్ సగానికి పైగా హైదరాబాద్‌లోనే జరుపుకోవడం విశేషం. కేరళ నుంచి తెలంగాణకు జాబ్ చేయడానికి వచ్చిన మలయాళీలు ఇక్కడ ఎలా ఉన్నారు అనే చిన్న కాన్సెప్ట్‌తో ఈ సిని మా వచ్చింది. ఇక ఫన్ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ చిత్రం మలయాళీలతో పాటు తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా సినిమాలో వచ్చిన చార్మినార్, ట్యాంక్‌బండ్, తెలంగాణ సెక్రటేరియట్, అంబేద్కర్ విగ్రహం సీన్స్ అయితే మూవీకే హైలెట్ అని చెబుతున్నారు. మనం రోజు తిరిగే హైదరాబాద్ ఇంత అందంగా ఉంటుందా అనేంతలా క్యాప్చర్ చేసి హైదరాబాదీలకు ఒక లవ్ స్టోరీ ఇచ్చాడు అని దర్శకుడికి కామెంట్లు చేస్తున్నారు. ఇక మలయాళంలో హిట్ అయిన ఈ సినిమాను తెలుగులో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. త్వరలో ఎవరో ఒక నిర్మాత ఈ సినిమాను కొనుగోలు చేసి తెలుగు డబ్బింగ్ చేయించి రిలీజ్ చేసినా ఆశ్చర్యం లేదు.

Owner, Editor, Printed & Published : Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District -500098. Telangana. Printed at S.A Printers,D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District -500098, Telangana, RNI NO : TELTEL/2023/86487 Cell: 8125972476. website : quicktodaynews@gmail.com, e-mail : gbuchireddy79@gmail.com